ఈనాడు ఆదివారం

30 ఆగస్టు 2026

వెన్న ముద్దు ముచ్చట్లు!

బాక్సాఫీస్‌లో... హాలీవుడ్ హంగామా!

(c) eenadu
eenadu epaper eenadu

భాషలతో సంబంధం లేకుండా... తనదైన నటనతో, దేశవ్యాప్తంగా అభిమానులతో అనుబంధాన్ని సంపాదించుకున్నాడు దుల్కర్ సల్మాన్. మలయాళీ మెగాస్టార్ కొడుకుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినా... కష్టపడే మనస్తత్వంతోపాటు బలమైన కథలు, వైవిధ్యమైన పాత్రలతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగాడు. త్వరలో ‘ఐ యామ్ గేమ్’తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ హీరోతో కలిసి పనిచేసిన కొందరు హీరోయిన్లు అతడి గురించి ఏం చెబుతున్నారంటే...



అదే అతని ప్రత్యేకత!

ఎవరికైనా వెంటనే నచ్చేస్తాడు - కీర్తి సురేశ్

దుల్కర్ నాకు చిన్నప్పట్నుంచీ తెలుసు. ‘మహానటి’లో మొదటిసారి కలిసి పనిచేశాం. టాలీవుడ్‌లో మొదటి మూవీలోనే ‘జెమినీ గణేశన్’ వంటి పాత్రకు ఒప్పుకోవడం గొప్ప విషయం. సినిమా కోసం కష్టపడే వ్యక్తి. సెట్‌లో ప్రశాంతంగా కనిపించినా... యాక్టింగ్‌లో మాత్రం దూకుడుగా ఉంటాడు. భాష మీద అవగాహన ఉంటే- బాగా నటించడానికీ డైలాగులు చెప్పడానికీ అవకాశం ఉంటుందని, అప్పుడే తెలుగు నేర్చుకున్నాడు. ఆ సినిమాకి డబ్బింగ్ కూడా చెప్పాడు. తన ప్రవర్తన, మాట్లాడే విధానంతో ఎవరికైనా వెంటనే నచ్చేస్తాడు.

అందుకే అంత సహజత్వం - నిత్యామేనన్

మా ఇద్దరి మొదటి సినిమా ‘ఉస్తాద్ హోటల్’. అప్పుడు పెద్దగా మాట్లాడుకోలేదు. తరువాత ‘ఓకే బంగారం’, ‘100 డేస్ ఆఫ్ లవ్’ రెండు సినిమాలనూ ఒకేసారి మేమిద్దరమే చేయాల్సి వచ్చింది. ఒకసారి డైరెక్టర్‌తో ‘దుల్కర్‌తో రెండు సినిమాలు చేయాల్సి ఉంది కదా... మేమిద్దరం ఫ్రెండ్స్ అయితే, బాగుంటుంది’ అని చెప్పా. అది విన్న డైరెక్టర్ ఆశ్చర్యంతో- ‘దుల్కర్ కూడా అదే చెప్పాడు’ అన్నాడు. అలా మంచి మిత్రులమయ్యాం. ఆన్‌స్క్రీన్‌లో మా మధ్య కెమిస్ట్రీ బాగుంటుందని చాలామంది చెబుతుంటారు. షూటింగ్‌లో హీరో, హీరోయిన్లలా కాకుండా... స్నేహితుల్లా ఉండడంతోనే సన్నివేశాలు సహజంగా కుదురుతాయి.

తెలుగు డైలాగ్స్‌ని వివరించేవాడు - మృణాల్ ఠాకూర్

దుల్కర్‌కి నేను పెద్ద ఫ్యాన్‌ని. ‘సీతారామం’ షూటింగ్‌లో బాగా ప్రోత్సహించాడు. తెలుగులో నా మొదటి మూవీ అదే కావడంతో- పెద్దపెద్ద డైలాగులు చెప్పడానికి ఇబ్బంది పడ్డా. నా పరిస్థితిని అర్థం చేసుకున్న దుల్కర్- డైలాగులను చిన్నగా విభజించి, అర్థమయ్యేలా వివరించేవాడు. చాలా అంకితభావంతో పనిచేస్తాడు. ఏ భాషలోనైనా సినిమాలు చేయడానికి ధైర్యంగా ఒప్పుకుంటాడు. అతని స్ఫూర్తితోనే నేనూ తెలుగు, తమిళం, కన్నడ చిత్రాలకు ఓకే చెబుతున్నా.

ఇంటికి పిలిచి భోజనం పెట్టాడు - మీనాక్షి చౌదరి

నటులందరూ... కొందరు గొప్ప నటులతో కలిసి పనిచేయాలనుకుంటారు. అలాగే, నా లిస్ట్‌లోనూ దుల్కర్ పేరు ముందుంటుంది. పెద్ద బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా... యాక్టింగ్‌లోనూ సూపర్ టాలెంట్ ఉన్నా... చాలా వినయంగా, సింపుల్‌గా ఉంటాడు. ‘లక్కీ భాస్కర్’ షూటింగ్‌లో నేను కొంచెం అలసిపోయినా, కంగారుపడినా... నా వద్దకొచ్చి, ‘నీకు కావాల్సినంత సమయం తీసుకో. ప్రశాంతంగా ఉండు’ అని ధైర్యం చెప్పేవాడు. ఒకసారి నన్నూ, డైరెక్టర్నీ తన ఇంటికి భోజనానికి పిలిచాడు. అక్కడే మమ్ముట్టి సర్‌ని కలిసి మాట్లాడే అవకాశం వచ్చింది. తండ్రి నుంచే అతనికి ఆ మంచి గుణాలన్నీ వచ్చాయని, నాకు అప్పుడే అర్థమైంది.

బాధలో ఉన్నప్పుడు మెసేజ్ చేస్తాడు - అనుపమ పరమేశ్వరన్

నేను కష్టకాలంలో ఉన్నప్పుడు ఇండస్ట్రీ నుంచి అండగా నిలిచేవారిలో మొదటి వ్యక్తి దుల్కర్. నేను బాధలో ఉన్నానని తెలిసినప్పుడల్లా తననుంచి మెసేజ్ వస్తుంది. ‘ఈ విషయం తనకు ఎలా తెలుస్తుంది’ అని ఇప్పటికీ ఆశ్చర్యపోతా. అతనితో ఒకసారి మాట్లాడితే చాలు- బాధంతా పోయి, ప్రశాంతంగా అనిపిస్తుంది. నాకు ఏదైనా సమస్య ఉన్నప్పుడు మొదట గుర్తొచ్చే వ్యక్తి కూడా అతనే. ఏ సమయంలోనైనా ఫోన్ చేసి, తనతో మాట్లాడే చొరవ నాకుంది.

(c) eenadu

లోపల

4 ఇది విన్నారా

5 ఈ కృష్ణుడికి... ఇంకా అప్పు చెల్లిస్తున్నారు!

6 అవీ ఇవీ

7 ఈ ప్యాన్లతో కరెంట్ బిల్లు తగ్గుతుంది!

8 పరిశోధన

9 బాక్సాఫీస్‌లో... హాలీవుడ్ హంగామా!

12 అన్‌స్టాప్‌లో... అన్నీ ఉంటాయ్!

13 కీచెయిన్‌తోనే బిల్లు కట్టొచ్చు!

14 వెన్న ముద్దు ముచ్చట్లు!

16 కళ్లులేనివాడికి ఇంజనీరింగ్ ఎందుకన్నారు!

18 కథ

20 డాక్టర్ నెట్... నిరుపేద రోగులకి తోడూనీడా!

21 రుచి అభిరుచి

22 సిసింద్రీ

24 సమీక్ష

25 రాశి ఫలం

26 పదకేళి



క్లిక్... క్లిక్...

ప్రకృతిలోనూ దేశభక్తిని చూపిస్తూ, కెమెరాలో బంధించాడు కేరళలోని ఇడుక్కి ప్రాంతానికి చెందిన ఓ ఫొటోగ్రాఫర్. సందెపొద్దు- కాషాయ రంగునీ, పచ్చటిపైరు- ఆకుపచ్చ వర్ణాన్నీ ప్రతిబింబిస్తుంటే... నడుమ పాలధారల్లా కిందకు దూకుతున్న జలపాతం శ్వేతవర్ణాన్ని తలపిస్తూ, మొత్తంగా ఆ దృశ్యం మన జాతీయ జెండాలా కన్పించడం లేదూ!

మంచిమాట

నీ కోసం ఏడ్చేవారుంటే,
అది నీ అదృష్టంగా భావించు.
నిన్ను చూసి ఏడ్చేవారుంటే
అది వాళ్ళ ఖర్మ అనుకుని వదిలెయ్యి.

కళ్లజోడు బరువు!

సీత బరువు చూసుకుంటూ 66 కేజీలు ఉన్నాననుకునేది, కానీ ఒకరోజు కళ్లజోడు పెట్టుకుని చూసింది అప్పుడు ఆమె బరువు 88 కిలోలు ఉంది. కళ్లజోడు బరువు 22 కేజీలా అనుకుని ఎప్పటిలాగే వాటిని తీసి బరువు చూసుకోవడం మొదలుపెట్టింది!

పెళ్లైన ఆడవాళ్లకు రెండు సలహాలు!

మీ భర్త సెలక్షన్లను చూసి నవ్వకండి. ఎందుకంటే వాటిలో మీరు కూడా ఒకటి.

★ మీ సెలక్షన్లను చూసుకుని గర్వపడకండి, అందులో మీ భర్తను ఎంచుకోవడం కూడా ఒకటి ఉంది కాబట్టి.

జిరాక్స్ కాపీ

వెంగళప్ప: బేరర్... మీహోటల్‌లో కాఫీ ఎంత?

బేరర్: యాభై రూపాయలు

వెంగళప్ప: మోసం... ఎదుటిషాపులో కాఫీ రెండు రూపాయలేనట... కావాలంటే బోర్డు చూడు.

బేరర్: వాళ్లిచ్చేది కాఫీ కాదు... కాపీ... అది జిరాక్స్ షాపండీ బాబూ!

పళ్లు బాగానే ఉన్నాయిగా!

భర్త: రెండు కళ్ళూ బాగానే కనిపిస్తున్నాయిగా, ఆ మాత్రం బియ్యంలో రాళ్లు ఏరలేవా?

భార్య: మీకు 32 పళ్ళూ బలంగానే ఉన్నాయిగా, అన్నంలో రెండు రాళ్లు వస్తే నమలలేరా?

అలా చేయడం తప్పు!

భార్య: మిమ్మల్ని పెళ్లి చేసుకునే బదులు ఓ రాక్షసుడ్ని పెళ్లి చేసుకుంటే సుఖంగా ఉండేదాన్ని.

భర్త: అలా రక్త సంబంధీకులను పెళ్లి చేసుకోవడం మంచిది కాదట.

మన సామెత

కొండ నాలుకకు మందు వేస్తే
ఉన్న నాలుక ఊడిందట.

(c) eenadu

ఇది విన్నారా

శబ్దాలకు జంతువుల స్పందనను తెలుసుకోవడానికి దక్షిణాఫ్రికాలోని ఒక అడవిలో నీటికుంటల వద్ద కెమెరాలతోపాటు స్పీకర్లనూ అమర్చి- మనుషుల మాటలూ సింహాల గర్జనలూ వేటకుక్కల అరుపులూ వినిపించారు శాస్త్రవేత్తలు. జంతువుల శబ్దాలు విన్నప్పటికంటే, మనుషుల మాటలను విన్నప్పుడే ఇతర జంతువులు ఎక్కువగా భయపడ్డాయట.

చాటింగ్‌లో తరచుగా మీమ్స్ షేర్ చేసుకునే తోబుట్టువుల మధ్య బంధం మరింత బలంగా ఉంటుందని మానసిక నిపుణుల మాట.

రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో కారు ఆపి కునుకుతీయడం నేరమనే చట్టం అమెరికాలోని కొన్ని నగరాల్లో అమలులో ఉంది. దీన్ని అతిక్రమించినవారికి జరిమానాలు విధించడమే కాకుండా కార్లనూ సీజ్ చేస్తారు.

రోడ్డు పక్కన జీవించే డీడీ అనే విద్యార్థికి- నిబంధనలను సడలించి, ఒహియోలోని లకోటా ఈస్ట్ హైస్కూల్‌లో ప్రవేశం కల్పించిన ప్రిన్సిపల్ రాబర్ట్ బర్న్‌సైడ్‌ని ఉద్యోగం నుంచి తీసేశారు. తరువాత ఆ ప్రిన్సిపల్ దంపతులు- ఆ పిల్లాడిని దత్తత తీసుకుని... అదే స్కూల్లో చేర్పించి, విద్యను పూర్తి చేయించారు.

టెక్సాస్‌లోని వీట్లీ హైస్కూల్‌లో కొత్తగా వచ్చిన ఒక ఉపాధ్యాయుడు- పన్నెండో తరగతి విద్యార్థులకూ చిన్నచిన్న వాక్యాలు రాయడమూ చదవడమూ రాకపోవడంతో బోరున ఏడ్చేశాడట.

యూకేకి చెందిన జిమ్మీస్టోన్- తన ముఖం, శరీర ఆకృతిని మార్చుకోవడానికి వందకుపైగా కాస్మోటిక్ ట్రీట్‌మెంట్స్ చేయించుకున్నాడట. ఇందుకోసం, పదహారేళ్లలో రూ.55 లక్షలకుపైగా ఖర్చు చేశాడు.

వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వాహకులు- అక్కడి గ్రాస్ కోర్టులను పక్షుల నుంచి కాపాడడానికి హారిస్ జాతి డేగ 'రూఫస్'ను ఉపయోగిస్తున్నారు. అది కోర్టులపైన తిరుగుతూ- పక్షులు రాకుండా కాపుకాస్తుంది. ఆడుతుండగా పక్షులు అడ్డురావడం, గడ్డిపైన రెట్టలు వేస్తుండడంతో- 1999 నుంచీ ఈ పద్ధతిని పాటిస్తున్నారు.



స్నేహితులనీ తెలిసినవాళ్లనీ సరదాగా ఆటపట్టించే ప్రాంక్ సర్వీస్ స్విట్జర్లాండ్‌లో ఉందట. ఇందుకోసం ఒక జోకర్‌ని నియమించుకుని, ఏడు రోజులపాటు వాళ్లని అనుసరిస్తూ... చీకట్లో భయపెట్టడం, బహిరంగ ప్రదేశాల్లో ఒక్కసారిగా ప్రత్యక్షమవడం, కొత్త నంబర్ల నుంచి మెసేజ్‌లు చేయడం వంటి ప్రాంక్‌లు చేస్తారు.

అందంగా కనిపించాలనీ ఆకట్టుకునేలా ఉండాలనీ అమ్మాయిలు మేకప్ చేసుకుంటారు కానీ... తక్కువ మేకప్ చేసుకునే, నాచురల్‌గా ఉండే యువతుల్నే యువకులు ఎక్కువ ఇష్టపడతారట.

మొహమాటంతో 'నో' అని చెప్పలేనివాళ్లు, తమ అవసరాలని పక్కన పెట్టి- ఇతరులను సంతోషపెట్టడానికి ప్రయత్నించేవాళ్లూ సమస్యల్లో పడే ఆస్కారం ఎక్కువట.

అమెరికాలోని మొంటానా రాష్ట్రంలో విద్యార్థులు గుర్రంపైన స్కూల్‌కి వస్తే... ఆ గుర్రానికి ఆహారం పెట్టి, రోజంతా చూసుకునే బాధ్యత ప్రిన్సిపల్‌దేనట. ఇది తెలిసిన పన్నెండు మంది సీనియర్ విద్యార్థులు- సరదాగా స్కూల్ చివరి రోజున గుర్రాలపైన వెళ్లడంతో, ప్రిన్సిపల్ వాటి బాధ్యత చూసుకోవాల్సి వచ్చింది.

ఉద్యోగులు ఎక్కువగా వేడుకలు, విహారయాత్రల కోసం సెలవు పెడుతుంటారు. కానీ, అమెరికాలో నలభైమూడు శాతం ఉద్యోగులు కేవలం విశ్రాంతి తీసుకోవడం, నిద్రపోవడం కోసమే సెలవు తీసుకుంటున్నారని ఓ సర్వేలో తేలింది.

ఇటలీకి చెందిన మౌరో మొరాండీ- ప్రశాంతత కోసం పొలినేషియా ద్వీపానికి వెళ్తుండగా... బుడెల్లీ ద్వీపం వద్ద అతని బోటు పాడైంది. అక్కడి ప్రకృతి సౌందర్యం నచ్చడంతో- అక్కడే నివాసం ఏర్పాటు చేసుకుని, 32ఏళ్లపాటు ఆ ద్వీపానికి కేర్ టేకర్‌గా పనిచేశాడు.

ప్రేమించి, పెళ్లిచేసుకోవడం... తరువాత గతం మర్చిపోయి, మళ్లీ వాళ్ల ప్రేమలోనే పడడం సినిమాల్లోనే చూస్తుంటాం. కానీ, కెనడాలో ఇది నిజంగా జరిగింది. బ్రేడన్ ఫాగనెల్లో, లారా ప్రేమపెళ్లి చేసుకున్నారు. తొమ్మిది నెలల తరువాత లారా తలపైన ఇనుపస్తంభం పడడంతో ఆమె గతం మర్చిపోయింది. అయితే, రెండేళ్లకు మళ్లీ తన భర్తనే తిరిగి ప్రేమించి, పెళ్లి చేసుకుంది.

(c) eenadu

తిరుమల వేంకటేశ్వరుడు కుబేరుడి అప్పును తీరుస్తున్నట్లే శ్రీకృష్ణుడికి ఓ రాజు బాకీ పడి, దాన్ని ఇప్పటికీ చెల్లిస్తున్న ఆలయమే అంబళప్పుళ శ్రీకృష్ణస్వామి క్షేత్రం. ఆ అప్పు ఏంటో, ఆ రాజు ఇంకా ఎందుకు చెల్లిస్తున్నాడో తెలుసుకోవాలంటే... ఈ ఆలయ విశేషాలను చదవాల్సిందే.

ఈ కృష్ణుడికి... ఇంకా అప్పు చెల్లిస్తున్నారు!

అంబళప్పుళ శ్రీకృష్ణస్వామి దేవాలయం... ఇక్కడ తయారుచేసే పాలపాయసాన్ని స్వీకరించేందుకు ఏకంగా గురువాయూర్ నుంచి శ్రీకృష్ణుడే రోజూ వస్తాడట. ఈ పాయసం తయారీకి ఆరేడుగంటల సమయం పడితే, ఇక్కడ శ్రీకృష్ణుడు కొలువైన తీరూ ఎంతో ఆసక్తికరం. కేరళ-అళప్పుళ జిల్లాలోని అంబళప్పుళ అనే ప్రాంతంలో బ్యాక్‌వాటర్స్‌కు దగ్గరగా, ఆకట్టుకునే నిర్మాణంతో కనిపిస్తుంది శ్రీకృష్ణస్వామి క్షేత్రం. ఈ ప్రాంతాన్ని పాలించిన ఓ రాజు, కృష్ణుడికి బాకీ పడి, తర్వాత స్వామిపైన భక్తితో ఇక్కడ ఆలయాన్ని నిర్మించి, ఆ అప్పును పాయసం రూపంలో ఇప్పటికీ చెల్లిస్తున్నాడనేది ప్రతీతి.

స్థలపురాణం

ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని చెంబకచ్చేరి పూరడం తిరునాళ్ దేవనారాయణన్ తంపురాన్ అనే రాజు పాలించేవాడు. చదరంగ ఆటగాడైన ఆ రాజు అందరినీ ఓడిస్తూ, తనకు తిరుగులేదని గర్వపడేవాడట. ఓసారి కృష్ణ పరమాత్ముడు అతని అహంకారాన్ని అణచివేయాలనుకుని ఓ వృద్ధుడి వేషంలో దర్బారుకు వెళ్లి, చదరంగం ఆడాలన్న కోరికను విన్నవించుకున్నాడట.



రాజు ఎలాగైనా తానే గెలుస్తాననే నమ్మకంతో పోటీకి సిద్ధమయ్యాడు. అయితే, రాజు కనుక ఓడిపోతే చదరంగం గళ్ల ఆధారంగా తనకు బియ్యపుగింజల్ని ఇవ్వాలంటూ ఆ వృద్ధుడు షరతు పెట్టాడట. అంటే... మొదటి గడిలో ఒక బియ్యపు గింజ, రెండోదాంట్లో రెండు, మూడోదాంట్లో నాలుగు, నాలుగోదాంట్లో ఎనిమిది... ఇలా ప్రతి గడికీ రెట్టింపు చేస్తూ అరవైనాలుగు గళ్లకు సరిపోయేలా బియ్యాన్ని ఇవ్వాలనేదే నిబంధన. రాజు ఆడటం మొదలుపెట్టినా చివరకు ఓడిపోయి, మాట ఇచ్చినట్లుగానే ఒక్కో గడికి సరిపడా బియ్యాన్ని సమర్పించేందుకు సిద్ధమయ్యాడు. అయితే, ధాన్యాగారంలోని బియ్యం అయిపోతున్నా ఆ గళ్లు నిండకపోవడంతో కంగారుపడి వృద్ధుడి కాళ్లపైన పడ్డాడట. అప్పుడా వృద్ధుడు కృష్ణుడిగా దర్శనమిచ్చి, రాజును మన్నించడమే కాక, తనకు ఆలయాన్ని నిర్మించమనీ, ఇంకా ఇవ్వాల్సిన బియ్యంతో పాలపాయసాన్ని వండి భక్తులకు పంచిపెట్టమనీ ఆదేశించాడట. అలా రాజు స్వామికోసం ఆలయాన్ని కట్టించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించి అప్పటినుంచీ బియ్యంతో పాలపాయసాన్ని తయారుచేసి పంచిపెడుతున్నా... ఇంకా ఆ అప్పు తీరకపోవడం గమనార్హం.

గంటలతరబడి వండుతూ...

వైష్ణవుల 108 అభిమాన క్షేత్రాల్లో ఒకటైన అంబళప్పుళ ఆలయంలో, కృష్ణుడు పార్థసారథిగా దర్శనమిస్తున్నాడు. ఈ స్వామిని పూజిస్తే జీవితంలో ఎదురయ్యే అవరోధాలు దూరమై, విజయాలు సొంతమవుతాయని భక్తుల విశ్వాసం. వినాయకుడు, భగవతి, అయ్యప్ప... తదితర దేవతలూ ఉండే ఈ క్షేత్రంలో రోజూ తయారుచేసే పాలపాయసానికి ఉన్న ఆదరణ అంతాఇంతా కాదు. లేత గులాబీరంగులోని ప్రసాదాన్ని స్వీకరించేందుకు ప్రతిరోజూ మధ్యాహ్నం గురువాయూర్ నుంచి శ్రీకృష్ణుడూ వస్తాడని అంటారు అర్చకులు. కేరళలో ప్రత్యేకంగా లభించే గులాబీరంగు బియ్యం, ఆలయ ప్రాంగణంలోనే ఉన్న గోశాలలోని గోవుల నుంచి తీసిన ఆవుపాలు, చక్కెరతో ఈ పాయసాన్ని తయారు చేస్తారు. నెయ్యి, డ్రైఫ్రూట్స్ లాంటివేవీ వాడరు. పొద్దున్నే ఆరు గంటలకు పాయసం తయారీని మొదలుపెట్టే ఆలయ నిర్వాహకులు... ఆవు పాలు సగం అయ్యేవరకూ సన్నని మంటపైన మరిగించి, అప్పుడు బియ్యాన్ని కలుపుతారు. బియ్యం ఉడికాక చక్కెర వేస్తే, పాయసం పూర్తయ్యేసరికి దాదాపు ఆరేడు గంటల సమయం పడుతుంది. తర్వాత స్వామికి నివేదించి, భక్తులకు పంచుతారు. ఇతర ప్రాంతాల వాళ్లు ముందే బుక్‌చేసుకుని ఈ పాయసాన్ని డబ్బాల రూపంలో ఇంటికీ తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపిస్తారు. ఇంకా... ఏటా పదిరోజులపాటు జరిగే ఆరట్టు ఉత్సవంలో పాల్గొనేందుకు వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుంటారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఏనుగుల ఊరేగింపు జరిగే తీరు ఎంతో ఆసక్తికరమైతే... ఆ వేడుకల్లో ఒకరోజు నిర్వహించే విందులో పాల్గొనే భక్తులకు-స్వామి చిన్ని కృష్ణుడి రూపంలో వచ్చి నెయ్యి వడ్డిస్తాడని నమ్ముతారు.

ఎలా చేరుకోవచ్చు

విమానంలో రావాలనుకునేవారు... కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాలి. అక్కడి నుంచి ఆలయాన్ని చేరుకునేందుకు ప్రైవేటు వాహనాలూ బస్సులూ ఉంటాయి. అదే, రైల్లో అయితే, అంబళప్పుళ స్టేషన్‌లో దిగొచ్చు. ★

(c) eenadu

అవీ ఇవీ

ఐదేళ్లుగా చెరువులోనే...

చెరువులో ఈతకొట్టాలని సరదా ఉంటే... గంటో, అరగంటో ఈతకొట్టి వచ్చేస్తారు. కానీ ఇక్బాల్‌షేక్ అనే పదహారేళ్ల కుర్రాడు ఐదేళ్లుగా వారాల తరబడి చెరువులోనే ఉంటూ, అక్కడే టిఫిన్లూ, భోజనాలూ కూడా కానిచ్చేవాడు. ఈత అంటే సరదా కాబట్టే ఇలా చేస్తున్నాడు అనుకుంటే పొరపాటు. ఎందుకంటే ఆ కుర్రాడికున్న ఓ వింత ఆరోగ్య సమస్య కారణంగానే, అలా చెరువులో ఉండిపోయేవాడు. పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ఉన్న బెల్డంగా గ్రామానికి చెందిన ఇక్బాల్ బయట ఉంటే ఒళ్లంతా నిప్పుల కొలిమిలో పెట్టినట్టు ఉంటుందట. అదే చెరువు నీళ్లలో ఉంటే కాస్త అయినా ఉపశమనంగా అనిపిస్తుందట. దాంతో ఐదేళ్లుగా ఇంట్లోకన్నా చెరువులోనే ఎక్కువ సేపు గడిపేవాడు. అక్కడే కుటుంబ సభ్యులూ, ఊరివాళ్లూ ఇచ్చిన ఆహారం తింటూ ఉండేవాడట. స్థానిక ఆసుపత్రికెళ్తే... ఇదేం సమస్యో మాకు తెలియదు అనేశారట. పెద్ద ఆసుపత్రులకు వెళ్లేంత ఆర్థికస్తోమత ఇక్బాల్ కుటుంబానికి లేదు. నిరంతరం నీటిలోనే ఉండటం వల్ల అనేక చర్మ సమస్యలు కూడా చుట్టుముట్టాయి ఈ కుర్రాడిని. ఇక్బాల్ చెరువులోనే ఉన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అది చూసిన అనంత్ అంబానీ ప్రత్యేక మెడికల్ విమానంలో ఆ కుర్రాడిని ముంబయికి తీసుకొచ్చి, రిలయన్స్ ఫౌండేషన్ సాయంతో వైద్యసాయం అందిస్తుండటం కొసమెరుపు.

నా 66 పైసలూ ఇవ్వాల్సిందే...

కర్ణాటకలోని హసన్ జిల్లాకు చెందిన చొక్కనగౌడ అనే రైతు కొన్నాళ్ల క్రితం బ్యాంకు నుంచి రూ.50వేలు అప్పు తీసుకున్నాడు. ఆ మొత్తాన్ని ఈ ఏడాదే తీర్చేశాడు. ‘అప్పు తీరిపోయింది, భారం తగ్గింది’ అని ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో ఆ రైతుకి ‘మీరింకా రూ.9.34 పైసలు బకాయి పడ్డార’రనే మెసేజ్ ఫోన్‌కి వచ్చింది. దాంతో ఆ రైతు బ్యాంక్‌కి వెళ్లి రూ.10 నోటు సిబ్బందికి ఇచ్చి, తక్కిన 66పైసలని కచ్చితంగా నాణేల రూపంలో ఇవ్వాల్సిందే అని పట్టుబట్టాడు. అలా ఇవ్వకపోతే వినియోగదారుల కోర్టులో కేసు వేస్తానన్నాడు. ‘అదెలా సాధ్యం... అర్ధరూపాయలే చలామణీలో లేవు, ఇక నీ 66పైసలని చిల్లర నాణేలుగా ఎలా ఇస్తాం’ అని బ్యాంకు సిబ్బంది సర్దిచెప్పబోతే- మరి మీరు నన్ను 34 పైసలు ఎలా కట్టమన్నారని వాదించాడు. దాంతో ఈ విషయం పైఅధికారుల వరకూ చేరింది. వాళ్లు ఆయనకు నచ్చచెప్పి ఆ పైసలని అతని ఖాతాలో నేరుగా జమచేసి, లోన్‌ని క్లియర్ చేశారట. రూల్స్ పేరుతో బ్యాంకులు సామాన్యులని ఇబ్బంది పెట్టినప్పుడు, అవే నియమాలతో సామాన్యులూ బ్యాంకులని ఇబ్బంది పెట్టగలరని నిరూపించాడీ రైతు.

కొండముచ్చులా అరిచే ఉద్యోగం!

దిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం, దిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్, మన పార్లమెంటు సహా మరికొన్ని ప్రభుత్వ శాఖలూ ఓ కొత్త ఉద్యోగానికి అభ్యర్థులని ఆహ్వానిస్తున్నాయి. ఈ ఉద్యోగానికి డిగ్రీలు అవసరం లేదు కానీ, ఒకే ఒక్క నైపుణ్యం ఉంటే చాలట. ఇంతకీ ఏంటా నైపుణ్యం అంటే... అచ్చంగా కొండముచ్చులాగా అరవడమే. ఇదేం పనీ, ఇంత విచిత్రంగా ఉంది అనుకుంటున్నారు కదా? దిల్లీలో ఈ మధ్యకాలంలో కోతుల బెడద బాగా పెరిగిపోయింది. ఆటలు చూదామని స్టేడియంకొచ్చిన ప్రేక్షకుల్ని... కోతులు అక్కడి నుంచి పారిపోయేలా చేస్తున్నాయట. ఒక్క స్టేడియంలోకే కాదు, మెట్రో స్టేషన్లలోకీ, సభ జరుగుతున్నప్పుడు పార్లమెంట్‌లోకి కూడా వచ్చి వానరాలు రచ్చరచ్చ చేస్తున్నాయట. కొండముచ్చులని చూస్తే కోతులు పారిపోతాయి కాబట్టి గతంలో వాటినే తీసుకొచ్చి బెదిరించేవారు. ప్రస్తుతం వాటిని బంధించడం నిషేధం కాబట్టి... వాటి కటౌట్లని పెట్టి బెదిరిస్తున్నారు. కానీ తెలివిమీరిన ఈ కోతులు ఆ ఫొటోలు ఏమీ చేయలేవని తెలుసుకుని, వాటిమీదే ఎక్కి కూర్చుంటున్నాయట. దాంతో మరోదారిలేక ఇలా కొండముచ్చుల్లా అరిచే నైపుణ్యం ఉన్నవారికి నెలకి పాతికవేల వరకూ జీతం ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారు. వీళ్లని ‘మంకీ విస్పరర్స్’ అనీ, ‘మంకీ స్కేరర్స్’ అనీ అంటున్నారు.

జెన్ ఆల్ఫా పిల్లలూ ఉద్యమించారు...

జెన్‌జీ పిల్లలు చేసిన ఉద్యమం ఇంకా మనసుల్లో మెదులుతుండగానే, ‘జెన్ ఆల్ఫా’ పిల్లలు చేసిన ఉద్యమ విజయం గురించి వినాల్సి వస్తుందంటే ఆశ్చర్యమేగా! ఉత్తర్‌ప్రదేశ్‌లోని హమీర్‌పుర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 11 ఏళ్లలోపున్న 300 మంది విద్యార్థులు తమ సమస్యలు చెప్పుకోవడానికి జాతీయ జెండాలు పట్టుకుని నాలుగు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అంత చిన్నపిల్లలకి సమస్యలేముంటాయి అనుకుంటున్నారా? వీళ్ల గ్రామం నుంచి స్కూల్‌కి వెళ్లడానికి మట్టి రోడ్డు మాత్రమే ఉంది, ‘మాకు పక్కా రోడ్డు కావాల’ని అధికారులని అడిగితే, వాళ్లు ఏదో కాస్త మట్టి పోసి, చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత పడిన వర్షాలకి ఆ మట్టి కాస్తా బురదగా మారి, పిల్లల యూనిఫాంలు పాడవుతున్నాయి... అంతేనా, వర్షం వస్తే- ఆ ఊళ్లోకి అంబులెన్సు కూడా రావడం లేదట. దాంతో ఈ పిల్లలంతా ఒక్కటై కలెక్టరేట్‌ని చుట్టుముట్టాలని నిర్ణయించుకుని, జెండాలు పట్టుకుని పోలీసులు ఆపినా ఆగకుండా కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లారు. ఎన్ని గంటలైనా కలెక్టర్‌ని కలిసే వెళ్తామని అక్కడే భైఠాయించారు. అలహాబాద్ హైకోర్టు ఈ ఘటనని సుమోటోగా స్వీకరించి, అధికారులని వివరణ అడిగింది. దాంతో అధికారులు దిగివచ్చి ప్రస్తుతం తాత్కాలిక రోడ్డు వేసి, త్వరలో రూ.రెండు కోట్లతో శాశ్వత రోడ్డు వేయడానికి ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారట. ఆల్ఫా పిల్లలా... మజాకానా!

(c) eenadu

‘బ్రో... ఫ్యాన్ స్పీడ్ పెంచు’, ‘ఆ పనేదో నువ్వే చెయ్ బ్రో’... ఫ్రెండ్స్ ఇద్దరూ ఒకరినొకరు బతిమలాడుకుంటున్నారు. వేసవికాలం... ఉక్కపోతతో విసిగిపోతున్నప్పుడు, పెద్ద శబ్దంతో, ‘తిరగనా, మాననా’ అన్నట్టు భారంగా తిరుగుతున్న ఆ ఫ్యాన్‌ని చూశాక... ‘ఈ యాభై ఏళ్లలో... ఫోన్లు మారాయి, టీవీలూ స్లిమ్ అయ్యాయి కానీ ఈ ఫ్యాన్లు మాత్రం మారలేదు’ అనుకున్నారు ఇద్దరూ. అలా, అనుకుంటున్నప్పుడే ఇద్దరికీ మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఆ ఐడియానే, నేడు రూ.నాలుగు వేల కోట్ల విలువైన ‘ఆటంబర్గ్ టెక్నాలజీస్’గా మారి మార్కెట్లో దూసుకుపోతోంది. ఇంతకీ ఆ టెక్నాలజీ ఎలా పనిచేస్తుందంటే...

ఈ ఫ్యాన్లతో కరెంట్ బిల్లు తగ్గుతుంది!

చాల్స్... అగ్గిపెట్టెల్లాంటి గదులతో, చిన్న బాత్‌రూమ్‌తో, నీటికి కటకటలాడుతుంటాయి ఈ భవంతులు. ముంబయిలాంటి మహానగరంలో కార్మికులూ, కూలీలూ తక్కువ అద్దెకు ఉంటారిక్కడ. అలాంటి ఓ చాల్‌లో ఐదేళ్లుగా కష్టపడుతున్నారు మనోజ్‌మీనా, శిబ్రబత్‌దాస్‌లు. అక్కడున్న మిగతావాళ్లకీ, వీళ్లకీ ఉన్న తేడా.... వాళ్లు రోజుకూలీలైతే, వీళ్లు... ఐఐటీ బొంబయిలో చదువుకుని సొంతంగా ఏదో చేద్దామన్న తపనతో, ప్రయత్నాలు చేస్తూ విఫలమవుతున్నవాళ్లు. మనోజ్ రాజస్థాన్‌లోని విద్యుత్తు సదుపాయం లేని ఓ కుగ్రామం నుంచి వచ్చాడు. శిబ్రబత్‌ది అసోంలోని సాధారణ కుటుంబం. ఇద్దరూ ఐఐటీలో స్నేహితులు... మనోజ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివితే, శిబ్రబత్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. చదువయ్యాక మనోజ్‌కి ఇస్రోలో ఉద్యోగం వచ్చింది. కానీ ఇంట్లో వాళ్లకి ‘నాకిక్కడ ఏడాదిపాటు లీవ్ ఇచ్చారు’ అని అబద్ధం చెప్పి, ఆ ఉద్యోగం మానేశాడు. సొంతంగా ఏదైనా చేయాలన్న తపనతో ప్రయోగాలు మొదలుపెట్టాడు. మరోవైపు శిబ్రబత్‌కి లక్షల ప్యాకేజీతో కార్పొరేట్ ఉద్యోగం వచ్చినా, మనోజ్ ప్రయోగాలపైన నమ్మకంతో జాబ్ మానేసి, ఫ్రెండ్ దగ్గరకు వచ్చేశాడు. అప్పట్నుంచీ వాళ్ల నివాసం ఐఐటీ బొంబయి క్యాంపస్‌కి దగ్గరగా ఉన్న ఆ చాల్‌లోనే. ఐఐటీ బొంబయి ఇంక్యుబేషన్ సెంటర్ సాయంతో ఎన్నో వ్యాపార ఆలోచనలు చేశారు. కానీ వాటిల్లో ఒక్కటీ ఆచరణలోకి

రాలేదు. స్నేహితులూ, మెంటార్లూ...‘టైమ్ వేస్ట్ చేసుకుంటున్నారు. మీపైన ఇన్వెస్టర్లకి నమ్మకం పోతోంది. ఇక ప్రయోగాలు ఆపి, ఉద్యోగాలు వెతుక్కోవడం మంచిది. పట్టుదలా, మొండితనం ఒకటి కావు’ అంటూ సలహా ఇచ్చారు. కానీ మనోజ్, శిబ్రబత్‌లు తినడానికీ, రోజుగడవడానికీ ఇబ్బంది పడుతున్నా... తమ ప్రయోగాలూ, ఆలోచనలూ ఆపలేదు.

అద్దె డబ్బుల కోసం...

డీఆర్‌డీవో, బార్క్, ఇస్రోవంటి ప్రభుత్వ సంస్థల్లో ఉండే పెద్దపెద్ద మెషీన్లు ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకునేందుకు వాడే... టెస్టింగ్ కిట్లని తయారుచేసి, ఆ వచ్చిన డబ్బుతో అద్దె చెల్లించేవారు మనోజ్, శిబ్రబత్‌లు. రోజులో 15 గంటలు సరికొత్త వ్యాపార ఆలోచనలే చేసేవారు. అలా, 2015లో ఒక రోజు ఫ్యాన్ రెగ్యులేటర్ తిప్పడానికి బద్ధకించి, నువ్వంటే నువ్వు తిప్పమని ఒకరినొకరు బతిమలాడుకుంటున్నప్పుడు వచ్చిన ఆలోచనే ఈ ‘బీఎల్‌డీసీ’ ఫ్యాన్. రక్షణరంగంలో రెగ్యులేటర్‌తో పనిలేని బీఎల్‌డీసీ ఫ్యాన్లని వాడుతుంటారు. సీలింగ్ ఫ్యాన్లకీ ఈ టెక్నాలజీ ఎందుకు వాడకూడదు అనే ఆలోచన వచ్చింది వీళ్లకి. దాన్నే ఆచరణలో పెట్టి మరికొన్ని ఫీచర్లు జోడించి, విజయం సాధించారు. ఇంతకీ ఈ బీఎల్‌డీసీ ఫ్యాన్లకీ సాధారణ ఫ్యాన్లకీ ఉన్న తేడా ఏంటంటే...

65శాతం విద్యుత్తు ఆదా...

సంప్రదాయ ఫ్యాన్లు ఇండక్షన్ మోటార్‌తో పనిచేస్తాయి. ఇవి ఎక్కువ కరెంట్ తీసుకుంటాయి, త్వరగా వేడెక్కుతాయి. అలాగే కరెంట్ బిల్లు కూడా ఎక్కువ వస్తుంది. బీఎల్‌డీసీ(బ్రష్‌లెస్ డైరెక్ట్ కరెంట్) ఫ్యాన్లలో ‘పర్మనెంట్ మాగ్నెట్స్’ని వాడటం వల్ల మోటార్ వేడెక్కదు, దీంతో 65శాతం కరెంట్ ఆదా అవుతుంది. ఈ ఫ్యాన్లకి రెగ్యులేటర్‌తో పనిలేదు, రిమోట్‌కంట్రోల్‌తో పనిచేస్తాయి. శబ్దం చేయవు, ఒకవేళ కరెంట్‌పోతే ఇన్వెర్టర్‌పైన తక్కువ వోల్టేజీతో కూడా పదిగంటలపాటు తిరుగుతాయి. ఇన్ని ఫీచర్లు ఉన్నా... వీటిని కొనడానికి కాదుకదా, తమ షాపులో పెట్టి అమ్మడానికి కూడా ఒక్క రీటైలరూ ముందుకు రాలేదు. ఉష, క్రాంప్టన్ లాంటి బ్రాండెడ్ ఫ్యాన్లు ఉండగా, వీటిని ఎవరు కొంటారని అంతా నిరాశ పరిచారు. దాంతో స్నేహితులిద్దరూ ఆసుపత్రులకూ, ఐటీ కంపెనీలకూ, కాలేజీలకూ వెళ్లి డెమో ఇచ్చి చూపించారు. టాటా మెమోరియల్ ఆసుపత్రిని ఒప్పించాక ఆర్డర్లు పెరుగుతూ వచ్చాయి. కానీ అవేమీ అంత ఆశాజనకంగా లేవు. ఇన్వెస్టర్లు ఇచ్చిన అరకొర పెట్టుబడీ అయిపోవచ్చింది. ‘మీరు చూస్తే కుర్రాళ్లు, పెద్ద సంస్థల ముందు నిలవలేరు’ అంటూ ఎవరూ పెట్టుబడి పెట్టలేదు. దాంతో సంస్థని మూసేద్దాం అని నిర్ణయించుకుని, చివరి ప్రయత్నంగా కొత్త ఇన్వెస్టర్లకి మెయిల్ పెట్టారు ఇద్దరూ. వాళ్లలో అభయ్‌పాండా అనే అతనికి ఈ కుర్రాళ్ల పట్టుదల నచ్చింది, అలాగే... వీళ్ల టెక్నాలజీ కూడా. ఆయనిచ్చిన రూ.70కోట్లతోనే నవీ ముంబయిలో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ని మొదలుపెట్టారు. సంస్థకి ‘ఆటమ్‌బర్గ్ టెక్నాలజీస్’ అనే పేరు పెట్టారు. అంతవరకూ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో ఆన్‌లైన్ అమ్మకాలకే పరిమితమైన ఈ ఫ్యాన్లు... నెమ్మదిగా 30,000 రీటైల్ షోరూమ్‌లకి చేరువయ్యాయి. ఈ కొత్త టెక్నాలజీని వాటర్ ప్యూరిఫైయర్లు, మిక్సీల్లో కూడా వాడి నాలుగున్నరవేల కోట్ల విలువని సంపాదించుకుంది ఆటమ్‌బర్గ్ సంస్థ. కష్టాలూ, కన్నీళ్లూ, సవాళ్లూ పక్కన పెడితే- బద్ధకంలోంచి పుట్టిన ఓ ఆలోచన ఎక్కడికో వెళ్లిపోయింది కదా! ★

(c) eenadu

పరిశోధన

ఆ మౌనం... మంచిదేం కాదు!

ఇంట్లో ఏదో గొడవ. మాటామాటా పెరుగుతూ ఉంది. అలాంటప్పుడు ఇద్దరిలో ఒకరు చటుక్కున మాట్లాడటం మానేసి... గదిలోకి వెళ్లి తలుపేసుకున్నారని అనుకుందాం. 'ఏదోలా గొడవ సద్దుమణిగింది కాబట్టీ.. చినికి చినికి గాలివాన కాలేదు కాబట్టీ... ఒకరు ఇలా మౌనందాల్చడం మంచిదే కదా!' అనిపిస్తుంది మనకు. కానీ భార్యాభర్తల్లో ఒకరు ఇలా తరచూ మూగనోము పట్టడం ఆరోగ్యకరమైన అనుబంధానికి సంకేతం కాదని అంటోందీ పరిశోధన. ఇలాంటివి తరచూ జరుగుతూ ఉంటే ఓ దశలో ఇద్దరూ ఉద్వేగపరమైన ఒంటరితనానికీ, తమ అనుబంధంపట్ల తీవ్ర అసంతృప్తికీ లోనయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటకకి చెందిన పరిశోధకులు సుమారు 2500 మంది దంపతులపైన చేసిన అధ్యయనం ఇది. ఎదుటివాళ్లని నోరుమూయించాలనో సాధించాలనో ఒకరు ఇలా మౌనం దాల్చడం వల్ల ఏ గొడవా సమసిపోదని పరిశోధకులు చెబుతున్నారు. నిజానికి ఇలా చేసేవాళ్లలోనూ- మనసులో దాని గురించి ఆవేశకావేశాలతో ఆలోచించడం పెరిగి గొడవకి కారణమైన విషయం కాకుండా మిగతావాటిపైన తగవులు పడడం జరుగుతుందంటున్నారు. మాటామాటా పెరుగుతోందనగానే 'ఈ విషయంపైన ఇప్పుడు మాట్లాడొద్దు... మళ్లీ డిస్కస్ చేద్దాం' అని ఇద్దరూ అనుకుని, కోపావేశాలు తగ్గాక దానిపైన మాట్లాడుకోవడం చక్కటి కమ్యూనికేషన్‌కి రాచబాటని అంటున్నారు. ఇది పరస్పర గౌరవాన్ని సూచిస్తుందని వాళ్ళు చెబుతున్నారు.

నారింజ రసంతో బీపీకి చెక్..!

నేటి పరిశోధనలు జన్యు దారి పడుతున్నాయి. వ్యాధికి కారణమైన అవయవాలూ, సమస్యలతోపాటూ వాటికి మూలమైన జన్యువులపైనా దృష్టిపెడుతున్నాయి. అలా రక్తపోటుకి కారణమైన ఎన్ఏఎంపీటీ, ఐఎల్6, ఐఎల్ 1బీ అనే జన్యువుల్ని ఇదివరకే గుర్తించారు శాస్త్రవేత్తలు. మనం తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు గుండె వేగాన్నీ, రక్తప్రసరణనీ పెంచే జన్యువులివి. దీంతోపాటే- ఎస్‌జీకే-1 అనే మరో జన్యువు- మన కిడ్నీలు సోడియంని నిల్వచేసే సామర్థ్యాన్ని తగ్గిస్తోందని పసిగట్టారు. ఈ నేపథ్యంలోనే ఈ జన్యువులని నియంత్రించే సులువైన ఆహారపదార్థాలు ఏవైనా ఉన్నాయా అన్న దిశగా పరిశోధన చేశారు బ్రెజిల్‌లోని సావో పాలో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు. నారింజ లేదా కమలాపండు రసం అందుకు చక్కగా ఉపయోగపడుతోందని తేల్చారు. ముప్పైల్లోనే బీపీ సమస్య బారినపడ్డ వారిలో కేవలం రెండు నెలల్లోనే ఇది మంచిఫలితం చూపిస్తోందని చెబుతున్నారీ శాస్త్రవేత్తలు. రోజూ అరలీటరు జ్యూస్ తాగినా చాలంటున్నారు. కాకపోతే, కృత్రిమ ఆరెంజ్ రుచులతో రసాయనాలు కలిపి చేసే పానీయాలు కాకుండా... సహజంగా చేసినవే మంచివని సూచిస్తున్నారు.

ప్రాణాయామంతో దురలవాట్లు దూరం..!

పొగ, మద్యం వంటి దురలవాట్లు దూరం చేసేందుకు ఏ సైడ్ ఎఫెక్టులేని, తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల కోసం ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు చేస్తూ ఉన్నారు శాస్త్రవేత్తలు. ఇప్పటికయితే అలాంటి విధానం మానసిక నిపుణులు అందించే కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ(సీబీటీ) మాత్రమే. అది తప్ప మిగతావేవీ లేవా అన్న ప్రశ్నతో పరిశోధన చేస్తున్న శాస్త్రవేత్తల దృష్టి ప్రస్తుతం ప్రాణాయామంపైన- శ్వాస నియంత్రణ పద్ధతులపైన- పడింది. ఆస్ట్రేలియాకి చెందిన మోనాష్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పొగ, మద్యం, మాదకద్రవ్యాలకి బానిసై అందులో నుంచి బయటపడాలనుకుంటున్న పదమూడు వందలమందిపైన ఈ పరిశోధన నిర్వహించారు. వాళ్లని రెండు బృందాలుగా విభజించి... ఒక బృందానికి శ్వాస వేగాన్నీ, గుండె కొట్టుకునే వడినీ తగ్గించే ప్రాణాయామ పద్ధతుల్ని నేర్పించారు. దురలవాటు వైపు మనసు లాగుతున్నప్పుడల్లా వాళ్లని తేలికపాటి ప్రాణాయామం చేయమన్నారు. మరో బృందానికి నిపుణుల చేత సీబీటీ అందించారు. ఆర్నెల్ల తర్వాత చూస్తే- సీబీటీకి ఇంచుమించు సమానంగానే వీళ్లలోనూ 'క్రేవింగ్' తగ్గిందట. ఈ రెండూ కలిస్తే ఏ దురలవాటునైనా పూర్తిస్థాయిలో జయించడం సాధ్యమేనని పరిశోధకులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

సమస్య మన స్క్రీన్ టైమ్‌తోనే...

'పిల్లలు ఎక్కువ సమయం ఫోన్ లేదా ట్యాబ్‌ని చూడటం వల్ల చాలా సమస్యలు వస్తున్నాయి... ముఖ్యంగా వాళ్లు ఏ భాషనైనా నేర్చుకోవడంలో వెనకపడుతున్నారు' అని ఇప్పటికే వైద్యులు చెబుతూ వస్తున్నారు. ఈ సమస్యనే- పెద్దవాళ్ల స్మార్ట్‌ఫోన్ వాడకంతో ముడిపెట్టి విశ్లేషించిన తాజా అధ్యయనం ఇది. నార్వేలోని యూనివర్సిటీ ఆఫ్ ఆస్లోకి చెందిన శాస్త్రవేత్తలు దీన్ని నిర్వహించారు. నాలుగేళ్లు నిండిన సుమారు 750 మంది చిన్నారుల్ని ఎంచుకుని... మూడేళ్లపాటు వాళ్లు నేర్చుకునే కొత్త పదాలకీ... వాళ్ల తల్లిదండ్రుల స్క్రీన్ టైమ్‌కీ ఉన్న సంబంధాన్ని పరిశీలించారు. పద సంపద(వొకాబులరీ)కి సంబంధించి ఈ పిల్లలందరూ సగటున ఐదేళ్లప్పుడు 51 మార్కులు తెచ్చుకుంటే... ఏడేళ్లప్పుడు 75 మార్కులు సాధించారట. కానీ ఈ పిల్లల్లోనూ కొందరి తల్లిదండ్రుల స్మార్ట్‌ఫోన్ వాడకం మూడుగంటలకి మించిపోయి ఉందట. అలాంటి చిన్నారుల వొకాబులరీ స్కోరు రెండుపాయింట్‌ల వరకూ తగ్గడం గమనించారట అధ్యయనకర్తలు. రెండుపాయింట్‌లన్నవి చిన్నగా కనిపించొచ్చుకానీ పిల్లల ఎదుగుదల విషయంలో కీలకమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పిల్లలతో మాట్లాడుతూ ఉన్నప్పుడు వచ్చే ఒక ఫోన్‌కాల్, ఒక మెసేజ్, ఇన్‌స్టాగ్రామ్ నోటిఫికేషన్... ఇవన్నీ పిల్లలకి ఆమేరకు తల్లిదండ్రుల సమయాన్ని దూరం చేస్తున్నాయనీ... ఇలా వాళ్ల మాటలకి అంతరాయం కలగడమే వొకాబులరీ తరుగుదలకి కారణమనీ వారు వివరిస్తున్నారు.

(c) eenadu

హీరోకు అభిమాన సంఘాలు లేకపోవచ్చు. సినిమా టైటిల్ నోరు తిరగకపోవచ్చు. ఇతివృత్తం ఇక్కడిది కాకపోవచ్చు. డబ్బింగ్ లేకపోతే భాషను అర్థం చేసుకోవడం కష్టం కావచ్చు. అయినా, జనం ఎగబడి చూస్తున్నారు. కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నారు. కొన్నిసార్లు, ఆ సమయానికి విడుదలైన భారతీయ చిత్రాలను కాదనుకుని మరీ, అటువైపే మొగ్గు చూపుతున్నారు. హాలీవుడ్ సినిమాలకు ఎందుకింత ఆదరణ? 'ఒడిస్సీ'లూ, 'స్పైడర్‌మ్యాన్'లూ సృష్టిస్తున్న సంచలనాలకు కారణం ఏమిటి?

బాక్సాఫీసులో... హాలీవుడ్ హంగామా!

ది ఒడిస్సీ...

రూ.200 కోట్లకుపైగా గ్రాస్ కలెక్షన్లతో సంచలనం సృష్టించింది. ఓ మహా యుద్ధంలో గెలిచి, ఇంటికి బయల్దేరిన యోధుడు ఆ సుదీర్ఘ ప్రయాణంలో తనను తాను తెలుసుకునే కథ ఇది. దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ ప్రాచీన గ్రీకు పురాణగాథను తనదైన కోణంలో తెరకెక్కించాడు.

స్పైడర్‌మ్యాన్ - బ్రాండ్ న్యూ డే...

రూ.500 కోట్ల క్లబ్‌లో సగర్వంగా చోటు సంపాదించింది. గతంలో 'అవతార్ - ది వే ఆఫ్ వాటర్' నెలకొల్పిన రికార్డునూ బద్దలు కొట్టింది. ప్రపంచంలో తన ఆనవాళ్లన్నీ చెరిపేసుకుని... కోరికోరి ఒంటరితనాన్ని అనుభవిస్తున్న ఆ కథానాయకుడు, అనేక అవరోధాలను అధిగమించి మళ్లీ అనుబంధాల మనిషిగా మారడమే ఇతివృత్తం. ఈ చిత్ర దర్శకుడు డెస్టిన్ డేనియల్.

'ముందు భారతదేశాన్ని గెలువు. అది సాధ్యమైతే ప్రపంచాన్ని జయించినట్టే' అని అలెగ్జాండర్‌కు సలహా ఇచ్చాడట అతని గురువు అరిస్టాటిల్. హాలీవుడ్ కూడా దాదాపుగా అలాంటి అభిప్రాయానికే వచ్చినట్టుంది. అందుకే, ఇండియాను ప్రపంచంలోనే అతిపెద్ద బాక్సాఫీస్ మార్కెట్‌గా గుర్తిస్తోంది. తమ సినిమాలు భారత్‌లో కనుక ఘనవిజయం సాధిస్తే, ఇక వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరమే ఉండదని గట్టిగా నమ్ముతోంది. ఆ విశ్వాసంతోనే, 'ది ఒడిస్సీ' సినిమా బృందం తన ప్రచారయాత్రలో... లండన్, ప్యారిస్, న్యూయార్క్ నగరాల సరసన ముంబయిని కూడా చేర్చింది. ప్రస్తుతం, హాలీవుడ్ సినిమాల గ్లోబల్ కలెక్షన్లలో పన్నెండు శాతం వరకూ మనమే అందిస్తున్నాం. ఆ వాటా త్వరలోనే పాతిక శాతానికి చేరుకోవచ్చని అంచనా. 'హాలీవుడ్‌కు ఇది భారతీయనామ సంవత్సరం. వరుసగా రెండు పెద్ద హిట్లు ప్రసాదించి ఓ కొత్త ఊపునిచ్చారు ఇక్కడి ప్రేక్షకులు' అంటారు ఐమాక్స్ థియేటర్ డెవలప్‌మెంట్ విభాగం వైస్-ప్రెసిడెంట్ ప్రీతమ్. భారతీయ నిర్మాతలు సైతం కొత్త సినిమా విడుదల తేదీని నిర్ణయిస్తున్న సమయంలో హాలీవుడ్ రిలీజ్ డేట్స్‌ను దృష్టిలో ఉంచుకుంటున్నట్టు సమాచారం. చూస్తూ చూస్తూ, ఎవరు మాత్రం కలెక్షన్లను వదులుకోవాలనుకుంటారు!

'ప్రాంతీయ' ప్రస్థానం!

గతంలో హాలీవుడ్ సినిమాలు ఇంగ్లిష్ తెలిసినవారికి మాత్రమే పరిమితమైన వినోద మాధ్యమాలు. ఆ అదృష్టం కూడా నగర ప్రజలకే దక్కేది. క్రమంగా అడ్డుగోడలన్నీ తొలగిపోతున్నాయి. తెలుగు, తమిళం, కన్నడ మొదలైన ప్రాంతీయ భాషల్లోనూ ఆ చిత్రాలు విడుదల అవుతున్నాయి. ఈ వెసులుబాటే హాలీవుడ్ సినిమాలను ఓమోస్తరు పట్టణాలకూ తీసుకెళ్తోంది. భారత్‌లో 'స్పైడర్‌మ్యాన్ - బ్రాండ్ న్యూ డే' ఘనవిజయంలో 'లోకల్' ప్రేక్షకుల పాత్ర చాలా ఉందని బాక్సాఫీసు పండితులు కూడా అంగీకరిస్తున్నారు. అప్పట్లో, హాలీవుడ్ సినిమాల్ని ప్రాంతీయ భాషల్లో చూడటం అంటే సహనాన్ని పరీక్షించుకోవడమే. తెరమీద కనిపించే పాత్రల హావభావాలకూ, సౌండ్‌బాక్స్‌లోంచి వినిపించే సంభాషణలకూ ఎక్కడా పొంతన ఉండేది కాదు. అనువాదమూ నాసిరకమే. మూడు దశాబ్దాల క్రితం, ముందు హిందీలో... ఆపైన తమిళ, తెలుగు భాషల్లో విడుదలైన 'జురాసిక్ పార్క్' తొలిసారిగా సామాన్యులకు హాలీవుడ్ పనితనాన్ని భారీస్థాయిలో పరిచయం చేసింది. ఆ తర్వాత వచ్చిన 'టైటానిక్' విస్మయపరిచే విషాదాంత ప్రేమకథను తెర మీద ఆవిష్కరించింది. రూ.వందకోట్ల మైలురాయిని అధిగమించిన 'అవతార్'... ప్రపంచం ముందు భారతీయ మార్కెట్ మహావతారాన్ని ప్రదర్శించింది. అప్పటి నుంచీ సగటున ఏడాదికో హాలీవుడ్ మెరుపు మెరుస్తూనే ఉంది. ఇంగ్లిష్, హిందీ తర్వాత తెలుగు, తమిళం డబ్బింగ్ వెర్షన్లే భారతీయ మార్కెట్‌లో అత్యధిక కలెక్షన్లను సాధించి పెడుతున్నాయిప్పుడు. కాబట్టే నిర్మాతలు

(c) eenadu

'వంద'నాలు!

గత ఐదారేళ్లలో అనేక హాలీవుడ్ చిత్రాలు భారతీయ మార్కెట్‌లో గ్రాస్ కలెక్షన్లలో వందకోట్ల మైలురాయిని అధిగమించాయి. ఆ జాబితాలో కొన్ని...

2025...

★ అవతార్- ఫైర్ అండ్ యాష్ (రూ.200 కోట్లు)
★ ఎఫ్-1 (రూ. 102 కోట్లు)
★ మిషన్ ఇంపాజిబుల్ - ది ఫైనల్ రెకనింగ్ (రూ.110 కోట్లు)

2024...

★ ముఫాసా - ది లయన్ కింగ్ (రూ.130 కోట్లు)
★ డెడ్‌పూల్ అండ్ ఉల్వరీన్ (రూ. 130 కోట్లు)

కాస్తంత స్వేచ్ఛ తీసుకుని, మన వాతావరణానికి తగినట్టుగా సంభాషణల్ని మార్చేస్తున్నారు. ఆ ప్రయత్నంలో సంస్కృతీ సంప్రదాయాల్నీ, మాండలికాల్నీ దృష్టిలో ఉంచుకుంటున్నారు. ఈతరహా 'స్క్రిప్ట్ లోకలైజేషన్' వల్ల వీక్షకుడు కథకు మరింత దగ్గర అవుతాడు. ఏఐ ఆధారిత ఆడియో ఇంజినీరింగ్ టెక్నాలజీతో 'లిప్ సింక్రనైజేషన్' లోపాల్ని సరిదిద్దుకునే అవకాశమూ ఉందిప్పుడు. ఫోటోరియలిస్టిక్, యానిమేషన్ చిత్రాలతోపాటూ లైవ్ యాక్షన్ మూవీస్ కోసం కూడా జనానికి బాగా తెలిసిన గొంతుకలతో డబ్బింగ్ చెప్పించడం మరో మంచి ప్రయోగం. 'ముఫాసా - ది లయన్ కింగ్'కు హీరో మహేశ్‌బాబు తన స్వరాన్ని అరువు ఇవ్వడం... ఆ చిత్రం టాలీవుడ్‌లో కలెక్షన్లు పెంచుకోడానికి బాగానే సాయపడింది. అంతకు ముందు రానా దగ్గుబాటి (అవెంజర్స్), నానీ (ది లయన్ కింగ్) కూడా హాలీవుడ్ సినిమాలకు స్వరదానం చేశారు. 'హి-మాన్ అండ్ ది మాస్టర్స్ ఆఫ్ ది యూనివర్స్' పెద్దగా ఆడకపోయినా, నిఖిల్ సిద్ధార్థ డబ్బింగ్ కారణంగా తెలుగు రాష్ట్రాల్లో ఆ సినిమా గురించి ఎంతోకొంత చర్చ జరిగింది. గతంలో వెంకటేశ్, జగపతిబాబు, సత్యదేవ్, వరుణ్ తేజ్, నిత్యా మేనన్... తదితరుల స్వరాలు సైతం తెరమీద ప్రతిధ్వనించాయి. ఫలానా హాలీవుడ్ మూవీలో తమ అభిమాన హీరో గొంతు వినిపిస్తుందనగానే... గ్రామీణ ప్రేక్షకులు సైతం ఆ చిత్రం పట్ల ఆసక్తిని పెంచుకుంటారు. మీడియాలో కథనాలు వెల్లువెత్తుతాయి. సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతుంది. మార్కెటింగ్ వ్యూహాల్లో భాగంగా, హాలీవుడ్ సినిమాల ట్రెయిలర్స్‌ను ప్రాంతీయ భాషల్లో కూడా విడుదల చేస్తున్నారు. ఈ ప్రయత్నాలేవీ వృథాగా పోవడం లేదు. 'ది ఒడిస్సీ' కలెక్షన్లలో 30 శాతం వరకూ ప్రాంతీయ భాషల డబ్బింగ్ వెర్షన్ల నుంచే లభించినట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గతంతో పోలిస్తే దేశంలో మల్టీప్లెక్స్‌ల సంఖ్య పెరగడం కూడా హాలీవుడ్ విజయాలకు ఒక కారణం. "అమెరికాలో థియేటర్ల భవిష్యత్తు గురించి మేం భయపడిపోతున్న సమయంలో... భారతీయ మార్కెట్ కొత్త ఆశలు రేపుతోంది. హాలీవుడ్ మూవీస్ ఇక్కడ కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నాయి. ప్రత్యేకించి, 'ఒడిస్సీ' విషయంలో ప్రజల ఆసక్తి నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. సినిమా విడుదలకు ఓ నెల ముందే మేం అడ్వాన్స్ బుకింగ్స్‌కు అవకాశం ఇచ్చాం. వెంటనే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినిమా అభిమానులు లక్షా యాభైవేల టికెట్లు కొన్నారు. అందులో ఇరవైవేలు భారతదేశం నుంచే కావడం గొప్ప విషయం!" అంటారు ఆ మూవీ ప్రొడ్యూసర్ ఎమ్మా థామస్.

'విశ్వ' ప్రేక్షకుడు!

భారతీయుల వెండితెర ప్రపంచం విస్తరిస్తోంది. అందులోనూ, తెలుగు ప్రేక్షకులు టాలీవుడ్ చిత్రాలకే పరిమితం కావడం లేదు. హిందీ సినిమాల్ని ఆదరిస్తున్నారు. మలయాళ చిత్రాల్ని మెచ్చుకుంటున్నారు. కన్నడ కస్తూరిని ఆస్వాదిస్తున్నారు. కొరియన్ డ్రామాలంటే పడిచస్తున్నారు. ఇక హాలీవుడ్ హంగామా గురించి చెప్పనక్కర్లేదు. నెట్‌ఫ్లిక్స్, జియో-హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్ లాంటి ఓటీటీ వేదికలు... ప్రేక్షకుల నాడిని పసిగట్టి తమ కలెక్షన్లలో ఇంగ్లిష్ సినిమాలకు పెద్దపీట వేస్తున్నాయి. 'రికమెండేషన్ అల్గారిథమ్స్' కారణంగా... మనం ఒక హాలీవుడ్ సినిమాను చూడగానే, ఆ హీరో ప్రధాన పాత్రలో వచ్చినవీ, ఆ ఫ్రాంచైజీలో భాగమైనవీ, ఆ చిత్ర దర్శకుడే ప్రాణంపోసినవీ... ఇలా 'తప్పక చూడాల్సిన' సినిమాల జాబితా ప్రత్యక్షమైపోతుంది. ఏ నెట్‌ఫ్లిక్స్‌లోనో పాత స్పైడర్‌మ్యాన్ సిరీస్‌లు చూసిన తర్వాత, ఆ వరుసలో మరో చిత్రం రాబోతోందంటే, సహజంగానే ఆసక్తి పెరుగుతుంది. 'అవతార్'కు అయినా, 'అవెంజర్స్'కు అయినా ఇదే మాట వర్తిస్తుంది. ఆ కుతూహలమే ఫస్ట్ డే, ఫస్ట్ షోకు లాక్కెళ్తుంది. సినిమా అభిమానులుగా తెలుగువాళ్లు ఎంత లోకల్లో, అంత గ్లోబల్ కూడా. తక్కువ బడ్జెట్‌లో, స్థానిక ఇతివృత్తాలతో తీసిన 'బలగం', 'కమిటీ కుర్రోళ్లు' లాంటి స్థానిక చిత్రాలను ఆదరిస్తూనే... హాలీవుడ్ యాక్షన్, థ్రిల్లర్, సైంటిఫిక్, హారర్ సినిమాలకూ మహరాజ పోషకులుగా మారుతున్నారు.

సైన్స్ ఫిక్షన్ సినిమాలూ, స్పేస్‌టెక్ డ్రామాలూ, సూపర్ హీరోల సిరీస్‌లూ... హాలీవుడ్ వాళ్ల యూఎస్‌పీలు. అక్కడ ఒక్కో దర్శకుడిదీ ఓ ప్రత్యేక శైలి. స్పీల్‌బర్గ్ సృష్టించే పాత్రలూ, జేమ్స్ కామరన్ చూపించే సాంకేతిక ప్రతిభా, డేవిడ్ ఫించర్ ప్రదర్శించే మనోవిజ్ఞాన పాటవమూ... ప్రేక్షకుడిని ఆశ్చర్యానికి గురి చేస్తాయి. ఆ జాబితాలో మరో దిగ్గజం క్రిస్టఫర్ నోలన్. తన సినిమా ఏమేరకు అర్థమైంది అనే దాని బట్టి ఓ మనిషి ఐక్యూను లెక్కించవచ్చని ప్రచారం. ఎందుకంటే, ఆ పాత్రలూ సంఘటనలూ ఇతివృత్తాలూ... చాలా వరకూ ప్రతీకాత్మకాలే. కొన్ని హాలీవుడ్ ఆణిముత్యాలు థియేటర్లలో పెద్దగా ఆడకపోయినా, ఓటీటీలో మాత్రం ప్రేక్షకాదరణ పొందుతున్నాయి. 'కెప్టెన్ అమెరికా', 'థండర్‌బోల్ట్స్', 'ది లాస్ట్ డ్యుయల్'... అందుకు ఉదాహరణలు. ఏ ఆస్కార్‌కో నామినేట్ కావడంతో హఠాత్తుగా

మేరా భారత్ మహాన్!

భారతీయులు హాలీవుడ్ సినిమాల ప్రేక్షకులుగానే మిగిలిపోలేదు. నటులుగా, దర్శకులుగా, సాంకేతిక నిపుణులుగా ఆ పరిశ్రమనూ ప్రభావితం చేస్తున్నారు.

'స్లమ్‌డాగ్ మిలియనీర్'లో మురికివాడ కుర్రాడి పాత్రను పోషించిన దేవ్ పటేల్‌కు భారతీయ మూలాలు ఉన్నాయి. తను ఆ తర్వాత కూడా చాలా హాలీవుడ్ సినిమాల్లో నటించాడు. 'మంకీమాన్' చిత్రంతో దర్శకుడిగానూ తనను తాను నిరూపించుకున్నాడు. 'ది నేమ్‌సేక్', 'లైఫ్ ఆఫ్ పై', 'జురాసిక్ వరల్డ్' తదితర చిత్రాలతో ఇర్ఫాన్‌ఖాన్ మంచిపేరు తెచ్చుకున్నాడు. ప్రియాంక చోప్రా 'ది వైట్ టైగర్', 'ది మ్యాట్రిక్స్ రిసరెక్షన్స్', 'లవ్ ఎగైన్' చిత్రాల్లో నటించారు. ఐశ్వర్య రాయ్ 'బ్రైడ్ అండ్ ప్రిజుడిస్', 'మిస్ట్రెస్ ఆఫ్ స్పైసెస్', 'పింక్ పాంథర్-2' మొదలైన సినిమాల ద్వారా ప్రతిభను చాటుకున్నారు. ఇప్పటికీ హాలీవుడ్ ఏఆర్ రెహమాన్ సంగీతానికి 'జయ్ హో...' అంటోంది. శేఖర్‌కపూర్, మీరానాయర్ లాంటివారు దర్శకత్వ ప్రతిభతో పరిశ్రమ పెద్దల ప్రశంసలు పొందారు.

(c) eenadu
eenadu epaper eenadu

2023...

- ★ ఓపెన్‌హైమర్ (రూ.130 కోట్లు)
- ★ మిషన్ ఇంపాజిబుల్ - డెడ్ రెకనింగ్ పార్ట్-1 (రూ.120 కోట్లు)

2022...

- ★ థోర్ - లవ్ అండ్ థండర్ (రూ. 102 కోట్లు)
- ★ డాక్టర్ స్ట్రేంజ్ ఇన్ ది మల్టీవర్స్ ఆఫ్ మ్యాడ్‌నెస్ (రూ.130 కోట్లు)
- ★ అవతార్ - ది వే ఆఫ్ వాటర్ (రూ.380 కోట్లు)

2021...

- ★ స్పైడర్‌మ్యాన్ నో వే హోమ్ (రూ.220 కోట్లు)

అందరి దృష్టిలో పడిపోయి.. 'ఓటీటీ సూపర్ హిట్స్' జాబితాకు ఎక్కుతున్న చిత్రాలూ చాలానే ఉన్నాయి. ప్రేక్షకుల్లో 'సినీఫైల్స్' అనే ప్రత్యేక వర్గం ఒకటుంది. ఈ బాపతు వ్యక్తులు, థియేటర్‌లో ఏ హాలీవుడ్ చిత్రం వచ్చినా ఓ విమర్శకుడిలా చూస్తారు. కథ, కథనం, దర్శకత్వం, నటన, సింబాలిజం, సైకాలజీ... ఇలా అన్ని కోణాల నుంచీ విశ్లేషిస్తారు. మనసుకు నచ్చితే స్వచ్ఛందంగానే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తారు. తేడాగా అనిపిస్తే మాత్రం, నిర్మొహమాటంగా కడిగిపారేస్తారు. దేశంలో పెరుగుతున్న 'జెన్-జీ' జనాభా కూడా హాలీవుడ్ సినిమాల విజయానికి ఒక కారణమని గుర్తించారు విశ్లేషకులు. టెక్నాలజీ మధ్య పుట్టిపెరిగిన నవయువతరాన్ని, అత్యుత్తమ సాంకేతికతతో రూపొందిన ఆ సినిమాలు సహజంగానే ఆకట్టుకుంటాయి.

హాలీవుడ్‌తో బంధుత్వం...

తెలుగు సినిమా హాలీవుడ్‌ను అనుకరించడం ఎప్పుడో మానేసింది. తనదైన సాంకేతిక ప్రతిభతో టాలీవుడ్‌నే ఆ స్థాయికి తీసుకెళ్తోంది. 'కల్కి- 2898 ఏడీ', 'బాహుబలి' తదితర చిత్రాల్లోని విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్, సినిమాటోగ్రఫీ ఏ అంతర్జాతీయ సినిమాకూ తక్కువ కాదు. అత్యున్నత ప్రమాణాలను సాధించే క్రమంలో మన పరిశ్రమ హాలీవుడ్ నిపుణుల సాయమూ తీసుకుంటోంది. రాజమౌళి 'ఆర్ఆర్ఆర్'కు మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని సమకూర్చిన 'యానిమాట్రిక్' సంస్థ 'అవెంజర్స్ : ఎండ్‌గేమ్', 'స్పైడర్-మ్యాన్ : నో వే హోమ్' తదితర చిత్రాలకూ పనిచేసింది. యష్ 'టాక్సిక్'కు యాక్షన్ డైరెక్టర్‌గా వ్యవహరించిన జె.జె. పెర్రీ గతంలో 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' లాంటి సినిమాలకు సేవలు అందించాడు. మహేశ్‌బాబు హీరోగా వస్తున్న 'వారణాసి' వీఎఫ్ఎక్స్‌లో కొన్ని హాలీవుడ్ సంస్థల్ని భాగం చేసినట్టు సమాచారం. కాబట్టే, 'ది ఒడిస్సీ' లాంటి గొప్ప చిత్రాలు కూడా మనవాళ్లకు మరీ కొత్తగా అనిపించవు. మహా అయితే, మరో 'బాహుబలి'ని చూస్తున్నట్టు ఉంటుంది. దీంతో, నేరుగా కథలో మమేకం అయిపోతారు. టేకింగ్ విషయంలోనూ కొందరు తెలుగు డైరెక్టర్లు హాలీవుడ్ టెక్నిక్స్‌ను ఉపయోగిస్తున్నారు. 'ప్రీవిజువలైజేషన్' టెక్నాలజీతో... తాము తీయాలనుకున్న సీన్లకు వర్చువల్‌గా ఓ రూపం ఇచ్చి... ఆ ప్రకారంగానే షూటింగ్ స్పాట్‌లో ఆయా దృశ్యాల్ని తెరకెక్కిస్తున్నారు. 'లోకల్ ఫ్లేవర్' కోసం అందులో పిడికెడు మట్టివాసనను గుప్పించడం మాత్రం మర్చిపోవడం లేదు.

వైఫల్యాలూ అనేకం...

హాలీవుడ్ అంటే గ్రాఫిక్ మాయాజాలాలు మాత్రమే కాదు. ఆ పరిశ్రమ చిక్కని అనుబంధాలనూ, మానవీయ కథనాలనూ దృశ్య కావ్యాలుగా మలిచిన సందర్భాలూ అనేకం. కాబట్టే, పాప్ సింగర్ మైఖేల్ జాక్సన్ జీవిత కథ మన దగ్గర కూడా ఎంతోకొంత విజయవంతంగా ఆడగలిగింది. స్పోర్ట్స్ డ్రామా 'ఎఫ్-1 ది మూవీ' వందకోట్ల మైలురాయిని అధిగమించగలిగింది. ఓ యూట్యూబర్ రూ.ఏడున్నర కోట్లతో తీసిన సైకలాజికల్ హారర్ 'అబ్సెషన్'... ఒక్క భారత్‌లోనే రూ.75 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లను వసూలు చేసింది. పారిస్‌లోని ప్రేక్షకుడైనా, పిఠాపురంలోని వీక్షకుడైనా ప్రాథమికంగా ఓ మనిషే. ప్రాంతాలూ అభిరుచులూ వేరైనా, ఇద్దరూ దాదాపుగా ఒకేస్థాయి ఉద్వేగాలను అనుభవిస్తారు. ఆ విశ్వజనీనమైన అంశాల్ని పట్టుకోవడంలోనే దర్శకత్వ ప్రతిభ దాగి ఉంటుంది. కాబట్టే, డైరెక్టర్‌కు ప్రతి సినిమా ఓ పరీక్షే. ప్రతి టేక్ మొదటి ప్రయత్నమే. ప్రేక్షక దేవుడి అభిరుచుల్ని ప్రతినిత్యం గమనించుకుంటూ ఉండాల్సిందే. హాలీవుడ్ సినిమా వచ్చిందనగానే సామాన్యుడు తన పనులన్నీ మానేసుకుని, 'సిరికిన్ జెప్పడు...' పద్యంలో విష్ణుమూర్తిలా థియేటర్ వైపు పరుగులు తీయడు. ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాడు. 'థియేటర్ ఎక్స్‌పీరియన్స్ అవసరమైన చిత్రమేనా?' అని బేరీజు వేసుకుంటాడు. 'ఒకట్రెండు నెలలు ఆగితే ఓటీటీలోకి వచ్చేస్తుంది కదా?' అని మనసుకు సర్దిచెప్పుకునే ప్రయత్నం చేస్తాడు. సోషల్ మీడియాలో రివ్యూలు చదువుకుంటాడు. ఆ వడపోతలో నిలబడకపోతే... వారాంతంలో ఏ తెలుగు సినిమాకో వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటాడు. అలాంటి కారణాల వల్లే కావచ్చు - 'మోర్టల్ ఇంజిన్', 'ది ఫ్లాష్', 'స్ట్రేంజ్ వరల్డ్' తదితర చిత్రాలు భారతీయ ప్రేక్షకులను మెప్పించలేకపోయాయి. భారీ తారాగణం ఉన్నా, గ్రాఫిక్స్‌కూ వీఎఫ్ఎక్స్‌కూ కొదవ లేకున్నా... ఆ పాత్రలతో, ఆ ఇతివృత్తంతో కనెక్ట్ కాకపోవడమే కొన్ని వైఫల్యాలకు కారణం. అప్పుడప్పుడూ నిర్మాతల వైపు నుంచి కూడా వ్యూహాత్మక తప్పిదాలు జరిగిపోతుంటాయి. సరిగ్గా ఆ సమయానికే అంతకు రెట్టింపు వినోదాన్ని అందించే బాలీవుడ్, టాలీవుడ్ సినిమాలు విడుదల కావడమూ ఓ అవరోధమే. పిల్లల పరీక్షల సీజన్లూ బాగానే దెబ్బకొడతాయి. మితిమీరిన విశ్వాసంతో ఇంగ్లిష్‌లో మాత్రమే విడుదల చేసి చేతులు కాల్చుకున్నవారూ ఉన్నారు. ఓ సినిమా వైఫల్యానికి కర్ణుడి చావుకు ఉన్నట్టే అనేక కారణాలు.



కొన్ని సినిమాలు చూస్తున్నప్పుడు... థియేటర్‌లో ఉన్న సంగతే మర్చిపోతాం. ఇంకొన్ని సినిమాలు చూస్తున్నప్పుడు..... థియేటర్‌లో లేకపోతే బావుండని తిట్టుకుంటాం.

మహాగొప్ప దర్శకుడికైనా సామాన్య ప్రేక్షకుడే అంతిమ తీర్పరి! ★

(c) eenadu

ఓ చిన్న సమస్యకు పరిష్కారంగా సరదాగా ప్రారంభించిన ఓ బ్లాగ్... నేడు మూడుకోట్లమందికి దిక్సూచిగా మారింది. అటు విద్యార్థులకూ ఇటు ఉద్యోగాన్వేషణలో ఉన్నవారికీ తగిన అవకాశాలను చూపిస్తూ... ఉచితంగా సేవల్ని అందిస్తోంది. వెయ్యికి పైగా కంపెనీలు భాగమైన ఆ ప్లాట్‌ఫాం పేరే అన్‌స్టాప్. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అంకిత్ అగర్వాల్ రూపొందించిన ఈ 'అన్‌స్టాప్' కథ పెద్దదే.

అన్‌స్టాప్‌లో... అన్నీ ఉంటాయ్!

చిన్న పట్టణంలో చదువుకున్న ఓ అమ్మాయికి కోడింగ్‌లో నైపుణ్యం ఉన్నా వాళ్ల కాలేజీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు జరగవు. ఓ పెద్ద కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం సంపాదించాలనేది మరో విద్యార్థి కల. తమ టాలెంట్‌ను నిరూపించుకునే వేదికల కోసం వెతికే ప్రతిభావంతులు ఎందరో. ఇక, ఉద్యోగవేటలో ఉన్నవారు వెతకని వెబ్‌సైట్లంటూ ఉండవు. ఇలాంటివారందరికీ దిశానిర్దేశం చేస్తూ బోలెడన్ని అవకాశాలను చూపిస్తుంది 'అన్‌స్టాప్'. దీన్ని ప్రారంభించింది దిల్లీకి చెందిన అంకిత్ అగర్వాల్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అంకిత్‌కు ముందునుంచీ ఓ స్టార్టప్ పెట్టాలని కోరిక. చదువుకునే రోజుల్లో ఎదురైన ఓ చిన్న సమస్య అతను అన్‌స్టాప్‌కు పునాది వేసేలా చేసింది. అంకిత్ ఘాజియాబాద్ ఐఎంటీలో ఎంబీఏ చదువుకుంటున్న రోజులవి. ఓ విద్యార్థిగా అతనికి రకరకాల పోటీల్లో పాల్గొనాలని ఉన్నా ఆ వివరాలు సమయానికి తెలిసేవి కావట. లేదంటే చివరి నిమిషంలో సమాచారం వచ్చేదట. ఇతర విద్యార్థుల బాధా అదే కావడంతో మొదట నిరుత్సాహపడినా... ఆ సమస్యకు తనవంతుగా ఏదో ఒక పరిష్కారాన్ని ఆలోచించాలనుకున్నాడట అంకిత్. చివరకు ఓ బ్లాగ్‌ను ప్రారంభించాడు. చుట్టుపక్కల క్యాంపస్‌లకు వెళ్లి ఎక్కడెక్కడ పోటీలు జరుగుతున్నాయో తెలుసుకుని బ్లాగ్‌లో ఎప్పటికప్పుడు పోస్ట్ చేయడంతో చాలామందికి ఉపయోగపడిందది. ఆ తర్వాత అంకిత్ హార్వర్డ్‌కు వెళ్లినా అక్కడా విద్యార్థులు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం కళ్లారా చూశాడు. అయితే, కొన్ని కారణాలతో హార్వర్డ్‌లో చదువు పూర్తిచేయకపోయినా ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో అక్కడ చేరిపోయాడు. కొన్నాళ్లకు అంకిత్‌కు ప్రమోషన్‌తోపాటు విదేశాలకూ వెళ్లే అవకాశం వచ్చింది. మరొకరైతే ఆనందంతో వెంటనే వెళ్లిపోయేవారు. కానీ అంకిత్‌కు ఏదో అసంతృప్తి. అప్పటికే రెండుమూడు స్టార్టప్ ఐడియాలు ప్రయత్నించినా విఫలమయ్యాయి. 'నేను ట్రై చేసిన స్టార్టప్‌లు కూడా విద్యార్థులకు సంబంధించినవే కావడంతో ఓసారి రిలయన్స్, ఆదిత్యబిర్లా గ్రూప్ సంస్థల నుంచి ఓ ప్రతిపాదన వచ్చింది... తమ కోసం ప్రతిభావంతులైన ఉద్యోగుల్ని చూపించమనేదే ఆ సారాంశం. అప్పుడే... పెద్దపెద్ద కంపెనీలు సరైన ఉద్యోగుల్ని వెతికేందుకు బోలెడు డబ్బు ఖర్చు చేస్తుంటే ఔత్సాహికులకు ఆ వివరాలు అస్సలు తెలియడంలేదని అర్థమైంది. బాగా ఆలోచించి ఒకప్పుడు నేను రూపొందించిన బ్లాగ్‌నే కొత్తగా రీ డిజైన్ చేస్తే ఎలా ఉంటుందనిపించింది. అలా ఇంకాస్త పక్కా ప్రణాళికతో అన్‌స్టాప్‌ను తీసుకొచ్చా...' అనే అంకిత్ ఈ వెబ్‌సైట్‌ను కంపెనీలూ, విద్యార్థులూ, ఉద్యోగ వేటలో ఉన్నవారూ... ఇలా అందరికీ ఉపయోగపడేలా మార్చాడు.

ఏ సమాచారమైనా తెలుసుకునేలా...

పూర్తిగా ఉచితంగా పనిచేసే ఈ అన్‌స్టాప్... విద్యార్థులు కోరుకున్న సమాచారాన్ని అందిస్తూనే నేరుగా మెంటార్లతో కనెక్ట్ అయ్యేలా చూస్తుంది. ఉదాహరణకు... ఓ విద్యార్థి ఇంటర్న్‌షిప్ చేయాలనుకుంటే హెచ్‌ఆర్, ఫైనాన్స్, డేటా సైన్స్, డిజిటల్‌మార్కెటింగ్... ఇలా వాళ్లకు ఇష్టమైన అంశంలో ఎక్కడెక్కడ ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్నాయో తెలియజేస్తుంది. లేదూ ఏవైనా పోటీల్లో పాల్గొనాలనుకుంటే ఆ వివరాలూ చెబుతుంది. అదే సమయంలో స్కాలర్‌షిప్‌లు అందించే సంస్థల గురించీ పేర్కొంటుంది. ఇవి కాక.. ఎప్పటికప్పుడు క్విజ్‌పోటీలను నిర్వహిస్తూ అందులో గెలిస్తే వాటిని రివార్డ్ పాయింట్లుగా మార్చి, ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నప్పుడు అవి ఉపయోగపడేలా చూస్తుంది. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం... వంటి ప్రముఖ సంస్థల్లోని ఉన్నతోద్యోగుల ద్వారా మెంటారింగ్ అవకాశం కూడా కల్పిస్తూనే మాక్ ఇంటర్వ్యూల్లో పట్టు సాధించేలానూ శిక్షణ అందిస్తుంది. అదనంగా ఏవైనా కొత్త కోర్సుల్ని చేయాలనుకునేవారికీ ఆ శిక్షణా కార్యక్రమాలను అందుబాటులోకి తెస్తుంది. అదేవిధంగా ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవారికి ఆయా అవకాశాలనూ ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లోనే పేర్కొంటుంది. 'ఈ రోజుల్లోనూ చాలా స్కూళ్లూ కాలేజీలూ పిల్లలకు- ఉద్యోగాలకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పించడంలో ఆసక్తి చూపించడంలేదు. ఏఐ గురించి అంతటా చర్చలు జరుగుతున్నా చాలామందికి ఇప్పటికీ ఇందులో అఆలే తెలియవు. ఇవన్నీ ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ విద్యార్థుల అవసరాలకు తగినట్లుగా రకరకాల కోర్సులనూ అందుబాటులోకి తెస్తున్నాం. మేం పూర్తి ఉచితంగా సేవలు అందిస్తున్నా... సంస్థలతో అనుసంధానం అవుతాం కాబట్టి వాళ్ల నుంచి డబ్బు తీసుకుంటాం. ప్రస్తుతం మా సంస్థ విలువ దాదాపు 330 కోట్ల రూపాయలైతే మాతో కలిసి పనిచేస్తున్న కంపెనీల జాబితాలో ఫ్లిప్‌కార్ట్, హెచ్‌యూఎల్, వాల్‌మార్ట్, అమెజాన్, అడోబీ, మెటా, జోహో... ఇలా వెయ్యికి పైగా ఉన్నాయి...' అనే అంకిత్ షార్క్‌ట్యాంక్‌కీ వెళ్లి తమ కంపెనీ గురించి తెలియజేసి రెండుకోట్ల రూపాయల్ని పెట్టుబడిగా కూడా అందుకున్నాడు. ★

(c) eenadu

కీచెయిన్‌తోనే బిల్లు కట్టొచ్చు!

స్కాన్ చేసి డబ్బులు పే చేయడం మనకు కొత్తేమీ కాదు... కానీ స్విచాఫ్ అయిన ఫోన్ నుంచి కూడా చెల్లిస్తే? చిన్న విజిటింగ్ కార్డులో పూర్తి వివరాల్ని పొందుపరిచి ఇవ్వడం పాతదే కావొచ్చు... అదే కార్డుని ఫోన్‌కి తాకించగానే అందులోని సమాచారమంతా ఫోన్లో సేవ్ అయితే? అందమైన బొమ్మలతో ఉండే కీచెయిన్లను కానుకగా ఇవ్వడం మామూలే... మరి ఆ బొమ్మ ద్వారా నచ్చిన వీడియోని బహుమతిగా ఇవ్వొచ్చంటే? బ్యాటరీ, ఇంటర్నెట్ లాంటివేమీ లేకుండానే ఇలాంటి మాయలెన్నో చేస్తూ, రకరకాల పనుల్నీ సులువు చేస్తోంది 'ఎన్‌ఎఫ్‌సీ' టెక్నాలజీ. అసలు దీని కథాకమామీషేంటో చూద్దాం పదండి!

ఏటీఎం కార్డులా ఉంది పెళ్లిపత్రిక. వధూవరుల పేర్లు తప్ప అందులో ఇతర వివరాలేం లేవు కానీ పైన ఎన్‌ఎఫ్‌సీ అన్న అక్షరాలు మాత్రం ఉన్నాయి. ఆ కార్డుని ఫోన్ మీద పెట్టగానే ఫోన్లో- పెళ్లికూతురు, సంగీత్, మెహందీ... తదితర పెళ్లి వేడుకలకు సంబంధించిన పూర్తి వివరాలన్నీ వచ్చేశాయి. ఇంకా దాంట్లోనే ఏఆర్, వీఆర్ ఆప్షన్లని నొక్కితే త్రీడీ లుక్కులో వీడియోలూ కనిపిస్తున్నాయి. మొన్నటికి మొన్న ఓ చెల్లి అన్న కోసం ఏదైనా కొత్త రాఖీని కొందామనుకుని వెతుకుతూ ఎన్‌ఎఫ్‌సీ రాఖీని చూసింది. ఆ కొత్త రాఖీని అన్నకు ప్రేమతో కట్టి, దాన్ని ఫోన్‌కి తాకించి చూడమంది. వెంటనే స్క్రీన్‌పైన వాళ్లిద్దరి జ్ఞాపకాల్ని గుర్తు చేసేలా ఫొటోలూ, వీడియోలూ ప్రత్యక్షం అయ్యాయి. ఇవే కాదు, వైఫై కనెక్ట్ చేయడం దగ్గర్నుంచీ బిల్లులు కట్టేవరకూ ఎన్నో పనులు ఈ ఎన్‌ఎఫ్‌సీ సాంకేతికత ద్వారా చిటికెలో జరిగిపోతున్నాయి. ఈతరాన్ని విశేషంగా మెప్పిస్తున్న ఈ స్మార్ట్ ఎన్‌ఎఫ్‌సీ ఎలా పనిచేస్తుందీ అంటే...

ఎన్‌ఎఫ్‌సీ అంటే నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లూ, వాచీలూ, వైర్‌లెస్ ఇయర్‌ఫోన్లూ, స్పీకర్లూ, రింగ్స్, బ్రేస్‌లెట్లూ, ఫిట్‌బ్యాండ్స్.. తదితర గ్యాడ్జెట్లన్నింటిలోనూ చాలావరకూ ఈ ఆప్షన్ ఉంటుంది. దీన్ని ఆన్ చేసుకుని, ఫోన్‌ని తాకితే చాలు, రెండు గ్యాడ్జెట్లూ క్షణాల్లో కనెక్ట్ అవుతాయి. ఒక ఫోన్లో నుంచి మరో ఫోన్లోకి సమాచారాన్నీ, ఫొటోల్నీ... ఇంకా ఏవైనా షేర్ చేసుకోవచ్చు. దీనికి బ్లూటూత్‌లా పాస్‌వర్డ్ అక్కర్లేదు. క్యూఆర్‌కోడ్‌లా కెమెరా స్కాన్ చేయాల్సిన అవసరం లేదు. రేడియో తరంగాల ద్వారా పనిచేస్తుంది ఇది. అంటే టీవీ రిమోట్, కారు కీ పనిచేసినట్టే. అయితే దాదాపు పది సెంటీమీటర్ల దూరంలోనే దీన్ని ఉపయోగించుకోగలం. కేవలం ఫోన్లోని సమాచారాన్ని పంచుకోవడానికే కాకుండా ఈ ఎన్‌ఎఫ్‌సీ టెక్నాలజీని ఇప్పుడు ఎన్నో పనులకూ వాడుతున్నారు. అత్యంత వేగంతోపాటు ఈ టెక్నాలజీని వాడటం చాలా తేలిగ్గా ఉండటమే దీని అసలైన ప్రత్యేకత అని చెప్పొచ్చు.

చెల్లింపుల నుంచి బహుమతుల దాకా...

డబ్బుల్ని నిమిషాల్లో పంపుకోవడానికి ఆన్‌లైన్ అకౌంట్ వచ్చింది. మళ్లీ ఇంటర్నెట్ లేకుండా కూడా పే చేసేలా యూపీఐ లైట్ వాడటమూ తెలిసిందే. ఇప్పుడైతే ఈ ఎన్‌ఎఫ్‌సీ ద్వారా ఫోన్ పూర్తిగా స్విచాఫ్ అయినా డబ్బులు చెల్లించొచ్చు. నియోఫినిటీ అనే కంపెనీ 'నియోజాప్' అనే పేమెంట్స్ సదుపాయాన్ని తెచ్చింది. క్రెడిట్, డెబిట్ కార్డుల్లో ఉన్న ట్యాప్ అండ్ పే ఫీచర్ తరహాలోనే ఇదీ పనిచేస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫెడరల్, యాక్సిస్ బ్యాంకుల్లాంటివి కూడా ఎన్‌ఎఫ్‌సీ పేమెంట్ స్టిక్కర్లూ, కీచెయిన్లను తీసుకొచ్చాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 'పేవేర్' పేరుతో స్మార్ట్ వాచీల్నీ, ఉంగరాల్నీ తెచ్చింది. అంతేకాదు, చిన్న చిప్‌తో ఎన్‌ఎఫ్‌సీ టెక్నాలజీతో తయారు చేసిన స్మార్ట్ నెయిల్స్ లాంటివీ వస్తున్నాయి. సింపుల్‌గా ఉంగరంతో తాకో, వేళ్లు కదిపో పేమెంట్లు చేసుకోవచ్చు అన్నమాట. డబ్బుల మాట కదా, రక్షణ సంగతేంటీ అంటారేమో. ఆ సందేహాలే అక్కర్లేదు, దగ్గరగా ఉన్నప్పుడే పనిచేయడం ఇంకా యాప్ ద్వారా కూడా ఆపరేట్ చేసుకునే వీలూ, లిమిట్ పెట్టుకునే ఆప్షన్లన్నీ ఉంటాయి.

ఈ ఎన్‌ఎఫ్‌సీని వాడుతూ మార్కెట్లో రకరకాల బహుమతులూ వస్తున్నాయి. ఇష్టమైన వారిని ఆశ్చర్యపరచడానికి ఎన్‌ఎఫ్‌సీ కార్డులూ, ట్యాగులూ, కీచెయిన్లూ, పెన్నులూ, బ్యాగులూ, బ్రేస్‌లెట్లూ, రాఖీల్లాంటివీ తయారుచేసి ఇస్తున్నారు. అందులో పాటలూ, వీడియోలూ, ఫొటోలూ... ఇలా మనం పంచుకోవాలనుకున్న వాటినేవైనా అందులో నిక్షిప్తం చేయొచ్చు. కేవలం ఫోన్‌ని వాటితో టచ్ చేస్తే అవన్నీ తెరపైన కనిపిస్తాయంతే. స్మార్ట్ హోమ్ ఆపరేషన్లకీ దీన్ని ఈమధ్య బాగానే వాడుతున్నారు. డోర్ తీయడం దగ్గర్నుంచీ లైట్లూ, ఫ్యాన్లూ ఆన్ ఆఫ్ చేయడం వరకూ ఈ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. అంతేనా, పెళ్లి పత్రికలు మొదలు బిజినెస్ కార్డుల వరకూ అన్నింటా ఈ టెక్నాలజీని జత చేస్తున్నారు. కావాల్సిన వివరాలతో మనకు నచ్చినట్టు పర్సనలైజ్డ్ ఎన్‌ఎఫ్‌సీ స్టిక్కర్లను తయారు చేసుకోవచ్చు. అందుకు అమెజాన్, ఇట్సీ, షాప్ ఎన్‌ఎఫ్‌సీ లాంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ఎన్నో ఉన్నాయి.

★



(c) eenadu

వెన్న ముద్దు ముచ్చట్లు!

'వెన్నపూస'...
ఆ పేరును తలవగానే- దాని వెన్నెల రంగూ, సుతిమెత్తటి రూపం, చల్లటి అనుభూతి, మాటలకందని మాధుర్యం... మనసులో మెదలుతాయి. అందుకే, కల్లాకపటం లేని మనసునీ, మృదువైన మాటల్నీ వెన్నతోనే పోలుస్తాం. స్వచ్ఛమైన ఆ సుగుణాలకు మురిసిపోయే, చిన్నికృష్ణుడూ వెన్న దొంగ అయ్యాడట. కమ్మదనానికి మారుపేరుగానూ చెప్పే వెన్నపూసలో రుచీ, ఘుమఘుమలతోపాటు, ఆరోగ్యప్రయోజనాలూ ఎన్నో ఉన్నాయి. ఈ కృష్ణాష్టమికి కన్నయ్యకు నైవేద్యంగా పెడుతూనే, ఆసక్తికరమైన వెన్న కబుర్లన్నీ చదివేద్దామా!

మురుకులూ, చెక్కలూ మొదలు మిఠాయిల వరకూ- కాస్తంత వెన్నపూస కలపకపోతే వాటికి కమ్మదనమే రాదంటూ- అప్పట్లో పిండివంటల్లో తప్పకుండా వెన్న వేసేవాళ్లు. 'అబ్బ, వెన్నంటే నాకెంత ఇష్టమో!' అంటూ దాని మాధుర్యాన్ని వర్ణిస్తూనే, అమ్మమ్మ మజ్జిగ చిలుకుతున్నప్పుడు పక్కన కూర్చుని వెన్న ముద్దల్ని తిన్న చిన్ననాటి జ్ఞాపకాల్నీ గుర్తు చేసుకుంటారు చాలామంది. కానీ ఇప్పుడు కాలం మారింది. పాలూ, పెరుగూలాగే వెన్ననూ ఇష్టంగా తినే అలవాటు పోయింది. వెన్న తింటే ఆరోగ్యానికి అంతమంచిది కాదన్న భావన పెరిగింది. ఇప్పుడు- కేవలం కేకులూ, కుకీలూ, బ్రెడ్ లాంటి బేకరీ పదార్థాల్లో... రోటీ, పాస్తా, మష్రూమ్, చికెన్ తదితర వంటకాల్లో రుచిని పెంచడానికే వేస్తున్నారు. కానీ కాస్త వెన్న తినడం వల్ల ఎంతో లాభం అంటున్నారు వైద్యులు.

పురాణాల్లో వెన్న...

రేపల్లెలో ముద్దుల కృష్ణయ్య వెన్న ముద్దల్ని దొంగిలించే పురాణకథలు వింటూనే ఉన్నాం. గొల్లభామల కళ్లు కప్పి, స్నేహితులతో కలిసి ఉట్టి మీదున్న కుండల్ని దింపి, వెన్ననంతా అందరికీ పంచే బాలకృష్ణుడి అల్లరి చేష్టల వెనక అద్భుతమైన ఆధ్యాత్మిక, సామాజిక కోణాలూ ఉన్నాయట. వెన్నను తోటి స్నేహితులకూ, వానరాలకూ పంచడం ద్వారా సమస్త జీవుల పట్లా ప్రేమను చూపించాడు. అంతేకాదు, స్వచ్ఛమైన వెన్నను నిర్మలమైన భక్తికి నిదర్శనంగానూ చెబుతారు. అందుకే, దేవాలయాల్లో వెన్నతో నైవేద్యాల్నీ సమర్పిస్తుంటారు.

అసలేంటీ వెన్న...

పాలు కాచి, తోడు పెట్టి పెరుగు మీద మీగడను బాగా చిలికితే పైన వచ్చేదే వెన్న. క్రీమీ క్రీమీగా కమ్మటి సువాసనలతో ఉంటుంది. వెన్న ప్రపంచంలోని అతి పురాతన పాల పదార్థాల్లో ఒకటి. ప్రాచీన ఈజిప్షియన్లూ, గ్రీకులూ వెన్నను కేవలం తినడానికే కాకుండా చర్మవ్యాధులకూ, కంటి ఇన్‌ఫెక్షన్లకూ, కాలిన గాయాలకు మందుగానూ రాసేవారు. రోమన్లు జుట్టు నిగారింపు కోసం వెన్నను తలకు రాసుకునేవాళ్లు, చర్మానికి మాయిశ్చరైజర్‌గా వాడేవారు. ఇంకా దీన్ని దీపాల్ని వెలిగించడానికీ ఉపయోగించేవాళ్లట. అలా 19వ శతాబ్దం నుంచీ దీని వాడకం బాగా పెరిగింది. క్రీమ్ సెపరేటర్ మెషీన్లతో ఎక్కువ మొత్తంలో వెన్నను తయారు చేయడం మొదలుపెట్టడంతో వాణిజ్యపరంగా వెన్న అమ్మకాలు ఎక్కువయ్యాయి.

సరికొత్త రుచుల్లో...

ఆవు, గేదె, మేక పాల నుంచి వెన్నను తీస్తారు. మిగతా వాటితో పోల్చితే ఆవు పాల వెన్న పసుపు రంగులో కనిపిస్తుంది. రిఫ్రిజరేటర్లు లేని రోజుల్లో వెన్న నిల్వ ఉండటానికి ఉప్పు కలిపేవారు. అందుకే ఇప్పుడు మార్కెట్లో సాల్టెడ్ బటర్ కూడా దొరుకుతుంది. ఇంకా మరింత రుచిని ఇవ్వడానికి తాజా క్రీమ్‌తో స్వీట్ బటర్‌నీ తయారుచేస్తున్నారు. ఇవి కాకుండా యూరోపియన్ బటర్ కూడా ఉంటుంది. ఎక్కువసేపు చిలకడం ద్వారా అధిక శాతం కొవ్వుతో వస్తుంది ఇది. ఇంకా బ్రెడ్ మీద రాసుకోవడానికి రకరకాల పదార్థాల్ని కలిపి ప్రత్యేకమైన పద్ధతిలో కాంపౌండ్ బటర్లనీ తీసుకొచ్చారు మాస్టర్ షెఫ్‌లు. వెల్లుల్లి, దాల్చినచెక్క లాంటి మసాలాలు మొదలు మామిడి, స్ట్రాబెర్రీ వంటి పండ్ల వరకూ రకరకాల పదార్థాల్ని కలిపి ఫ్లేవర్డ్ బటర్ వెరైటీలెన్నో వస్తున్నాయి. అవసరానికి తగ్గట్టు వాడుకునేలా వెన్న వాసనల బటర్ డ్రాప్స్, వంటల్లో వేయడానికి వెన్న పొడి, బటర్ స్టిక్స్ లాంటి ఉత్పత్తులూ చాలానే దొరుకుతున్నాయి.

ఎంత తినాలి?

సాధారణంగా మన శరీరానికి రోజుకు 20 నుంచి 35 గ్రాముల కొవ్వు అవసరం. కాబట్టి రోజుకి 5 నుంచి 10 గ్రాముల స్వచ్ఛమైన వెన్న తినొచ్చు. ఆరోగ్యంగా ఉన్నవాళ్లు రెండు టీస్పూన్ల వెన్నను ఆహారంలో భాగం చేసుకోవచ్చు. అయితే మోతాదు మించితే ఇందులోని సంతృప్త కొవ్వులు గుండె జబ్బులకు కారణం కావొచ్చు. అందుకే, హార్ట్‌పేషెంట్స్ వెన్నకు దూరంగా ఉండటమే మంచిది.

కాస్త జాగ్రత్త...

బయట రకరకాల బటర్ ప్యాకెట్లలో వెజిటబుల్ నూనెల్ని కలిపి కల్తీ చేస్తున్నారు. మార్కెట్లో దొరికే వెన్న కొనడం కన్నా ఇంట్లో తయారుచేసుకున్న తెల్లటి వెన్నపూసని వాడటమే ఆరోగ్యం అంటారు పోషకాహార నిపుణురాలు సుజాతా స్టీఫెన్. ★

ఎన్ని ప్రయోజనాలో...

వెన్న, నెయ్యి దాదాపు ఒకటే కదా. వెన్నను వేడి చేస్తేనే కదా నెయ్యి వచ్చేది అనుకుంటాం కానీ, వెన్న సహజమైన పదార్థం కాబట్టి దీంట్లో మిల్క్ ప్రొటీన్లూ, లాక్టోజ్, నీళ్లూ ఉంటాయి. నెయ్యిలో అవేమీ ఉండవు. ఇంకా నెయ్యితో పోల్చితే క్యాలరీలూ, కొవ్వులూ తక్కువ మొత్తంలో ఉంటాయి వెన్నలో.

వెన్నలో మన శరీరానికి అవసరమైన విటమిన్లు ఉంటాయి. దీంట్లోని ఎ-విటమిన్ కంటిచూపును మెరుగుపరచడానికీ, చర్మ ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. ఒక చెంచా వెన్న నుంచి శరీరానికి కావాల్సిన ఎ-విటమిన్‌లో దాదాపు 11 శాతం దొరుకుతుంది. పిల్లలకు తరచూ వెన్న ఇవ్వడం వల్ల కంటి సమస్యలు దూరం అవుతాయి.

★ దీంట్లో శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసే ఇ-విటమిన్ కూడా తగినంత మోతాదులో ఉంటుంది. ఇది శరీరంలోని కణాలను దెబ్బ తినకుండా కాపాడుతుంది.

★ ఇందులో క్యాల్షియం, సెలీనియం, మెగ్నీషియం, పొటాషియం... తదితర ఖనిజాలూ ఉంటాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లను దరిచేరనివ్వవు.

★ వెన్నలో ఎముకల ఆరోగ్యానికి అవసరమైన కె2-విటమిన్ కూడా ఉంటుంది. మనం ఆహారం ద్వారా తీసుకునే క్యాల్షియంను- ఎముకలూ, దంతాలకు సరిగ్గా చేర్చడంలోనూ, రక్తనాళాల్లో క్యాల్షియం పేరుకుపోకుండా చూడటంలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

★ వెన్నపూసలోని బ్యుటిరేట్ అనే ఆమ్లం జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. దీని వల్ల పొట్టలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది.

★ వెన్నలో కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల ఏ కాస్త తీసుకున్నా తక్షణ శక్తి వస్తుంది.

★ వెన్నపూసలో ఉండే మంచి కొవ్వు, కొలెస్ట్రాల్ మెదడు కణాల నిర్మాణానికీ, నరాల పనితీరుకూ అవసరమైన శక్తిని అందిస్తాయి. ఇంకా ఇది జ్ఞాపకశక్తినీ, ఏకాగ్రతనీ పెంపొందించడానికి తోడ్పడుతుంది. ఒత్తిడిని తగ్గించడంలోనూ బాగా పనిచేస్తుంది.

★ హార్మోన్ల అసమతుల్యత తగ్గడానికీ, సంతానోత్పత్తికీ వెన్న ఎంతో సాయపడుతుంది.

★ వెన్నలోని కాంజుగేటెడ్ లినోలిక్ యాసిడ్ శరీరంలోని అదనపు కొవ్వుల్ని కరిగించడానికి ఉపయోగపడుతుందని పరిశోధనల్లో బయటపడింది.

★ కీళ్ల వ్యాధులతో ఇబ్బంది పడే వాళ్లు వెన్నను ఆహారంలో భాగం చేసుకోవచ్చు. కీళ్ల నొప్పుల్ని తగ్గిస్తుంది ఇది.

పోషకాలు

టేబుల్ స్పూన్ వెన్నలో (14గ్రా.)

శక్తి	: 102 కిలో క్యాలరీలు
కొవ్వులు	: 11.5 గ్రాములు
శాచ్యురేటెడ్	: 7.3 గ్రా.
కొలెస్ట్రాల్	: 31 మిల్లీగ్రాములు
క్యాల్షియం	: 3 మి.గ్రా.
పొటాషియం	: 3 మి.గ్రా.
విటమిన్ ఇ	: 0.3 మి.గ్రా
విటమిన్ ఎ	: 97 మైక్రోగ్రాములు

మనమే ఫస్ట్

ప్రపంచవ్యాప్తంగా వెన్నను ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశాలు ఇవీ...

దేశం	వెన్న (టన్నుల్లో)
1. భారత్	74,35,000
2. యూరోపియన్ యూనియన్	23,30,000
3. అమెరికా	10,80,000
4. న్యూజిలాండ్	5,35,000
5. రష్యా	3,00,000

ప్రపంచవ్యాప్తంగా వెన్నను ఎక్కువ ఉత్పత్తి చేయడంలోనే కాదు, వినియోగించడంలో కూడా ముందు ఉన్నది మనదేశమే. కానీ అత్యధికంగా వెన్నను ఎగుమతి చేసే దేశం మాత్రం న్యూజిలాండ్. ఏటా దాదాపు 4,75,000 టన్నుల బటర్‌ని విదేశాలకు ఎగుమతి చేస్తుంది ఇది.

(c) eenadu
eenadu epaper eenadu

అతనికి... పుట్టుకతోనే చూపులేదు. రెక్కాడితేకానీ డొక్కాడని కుటుంబం. రోజూ తాగివచ్చే తండ్రితో తల్లి పడే బాధలు. ఇవన్నీ దాటుకుని ఇంజినీరింగ్ చేయాలనుకుంటే... అంధులకు ఆ అవకాశం లేదంటూ నిబంధనలు. కోర్టు సహాయంతో వాటినీ దాటి కంప్యూటర్ నిపుణుడైతే... నేనున్నానంటూ వచ్చింది క్యాన్సర్. అయినా అతను చేతులెత్తేయలేదు. అన్ని సవాళ్ళనూ అధిగమించి- అంతర్జాతీయ ఆర్థిక సంస్థ జెపీ మోర్గాన్ టెక్నికల్ విభాగంలో వైస్‌ప్రెసిడెంట్‌గా చేస్తున్న జన్ను నాగబాబు స్ఫూర్తి ప్రయాణం ఇది...

కళ్లులేనివాడికి ఇంజినీరింగ్ ఎందుకన్నారు!

ధన్... ధన్ మని తలుపు తడుతున్న చప్పుడు. అమ్మే తీసింది. నాన్న వెంటే సారావాసన గుప్పుమంది. లోపలికి వస్తూనే 'ఇంకా అన్నం వండలేదా?' అని అరుపు. అమ్మ చెంపలు ఛెళ్ళుమంటున్న చప్పుడు. గాజులు పగులుతున్న శబ్దం. కళ్లులేని నేను ఎటువెళ్లాలో తెలియక... గోడని పట్టుకుని తచ్చాడుతూ... 'అమ్మా... అమ్మా' అని పెద్దగా ఏడుస్తున్నాను. అమ్మమ్మ వచ్చి 'నానీ... రా నాన్నా' అంటూ బయటకు తీసుకెళ్లింది. నాకు భయం అంటే ఏమిటో అర్థమైన తొలి సందర్భం అది.

అప్పుడు నాకు ఐదేళ్లు ఉంటాయేమో. మర్నాడు ఉదయం అమ్మ కుట్టుమిషన్ చప్పుడుతోనే నిద్రలేచాను. రాత్రంతా నిద్రపోకుండా... కాశీసంచులు కుడుతూనే ఉన్నట్టుంది తను. అలా కుట్టినవాటిని అంగళ్లకి తీసుకెళ్లి అమ్ముతుండేది. వాళ్లిచ్చే పదీపరకాతోనే మా ఆకలి తీరేది. నాన్న ఓ సైకిల్ రిపేర్ షాపులో పనిచేస్తుండేవాడు కానీ సంపాదించిన ప్రతీ పైసానీ సారా హరించేది. అమ్మకి రోజూ నరకమే మిగిలేది. ఆ బాధలతోపాటూ నాకు కళ్లులేవన్న దిగులూ తోడయ్యింది తనకి. ఆ వేదనలన్నింటినీ నిశ్శబ్దంగా భరించేది. నిబ్బరంగా నిలిచేది. చూపులేని నాకు అమ్మ చేతుల వెచ్చదనమే ప్రపంచంగా ఉండేది. ఆ రోజు రాత్రి నాన్నతీరుతో వణికిపోయిన నాకు... ఉదయమే అమ్మలోని ఆ గాంభీర్యం కొత్త ధైర్యాన్ని ఇచ్చింది. జీవితంలో ఎంత పెద్ద తుపాను ఎదురైనా- నిశ్శబ్దంగా నిబ్బరంగా నిలవడం ఎలాగో నేను నేర్చుకోవడం మొదలుపెట్టిందీ బహుశా అప్పుడే కావొచ్చు!

అడుక్కు తినాల్సిందే

కృష్ణాజిల్లా ఉయ్యూరు దగ్గర్లోని జుజ్జువరం అన్న ఊరు మాది. పుట్టిన వెంటనే నాకు చూపులేదని డాక్టర్లు చెప్పేశారట. అమ్మ ఏడుస్తూ ఉంటే చూడ్డానికి వచ్చిన బంధువులెవరో 'వీడి బతుకు ఏమవుతుందో... కళ్లు లేకపోతే అడుక్కుతినాల్సిందే' అన్నారట. 'నా బిడ్డకు ఏనాటికీ ఆ పరిస్థితి రానీయను. ఎంత కష్టమైనా పడి, వాడు గౌరవంగా బతికేలా చేస్తాను' అందట అమ్మ అంత బాధలోనూ ఉక్రోషంగా. అందుకేనేమో నాకు ఆరేళ్లు రాగానే అంధుల బడిలో వేయాలని నాన్నని ఒప్పించి హైదరాబాద్‌కి తీసుకొచ్చింది. తనకి తెలిసింది ఒక్క కుట్టుపనే. నాన్నకేమో సైకిల్ రిపేరింగ్ తప్ప ఏదీ రాదు. అయితేనేం, 'మనం పస్తులున్నా సరే వీణ్ని చదివించాలి' అని పట్టుబట్టింది. అలా నేను దారుల్‌షిఫా బ్లైండ్ స్కూల్‌లో చేరాను. మేం ఇక్కడికొచ్చాకా నాన్న తీరు మారలేదు. తాగినప్పుడల్లా అమ్మపైన చేయి చేసుకోవడం మానలేదు. చూపులేకపోవడం కన్నా... పేదరికంకన్నా... అమ్మానాన్నల మధ్య జరిగే ఈ తగాదాలే నన్నెక్కువ కుంగదీస్తుండేవి. చదువే నన్ను ఆ బాధల్ని దిగమింగేలా చేసింది. వేలికొనలకి బుడిపెలు బుడిపెలుగా తగిలే బ్రెయిలీ అక్షరాలు నాకు కొత్త లోకాన్ని చూపాయి. 'టేలర్స్ బోర్డు'తో నేర్చుకునే లెక్కలు నాకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయి. హాస్టల్ జీవితం క్రమశిక్షణని నేర్పింది. నేను ఏడో తరగతికి వచ్చేటప్పటికీ నాకు ఇద్దరు చెల్లెళ్లు పుట్టారు. చిన్న చెల్లెలికి నాలాగే కళ్లు లేవు. నేనూ తనూ ఒకేచోట చదివితే మంచిదని అనుకున్న అమ్మ ఇద్దర్నీ దేవ్‌నార్- అంధుల పాఠశాలలో చేర్చింది. అక్కడే నా జీవితం మలుపు తిరిగింది...

ఒక్క మార్కు వచ్చింది

అప్పటిదాకా తెలుగు మీడియంలో చదివిన నాకు... దేవ్‌నార్‌లో ఇంగ్లిషు మీడియంలో చేరడం ఇబ్బందిగా మారింది. మొదటి యూనిట్ టెస్టులో సోషల్ స్టడీస్ సబ్జెక్టులో ఒక్క మార్కే వచ్చింది. క్లాసులో అందరూ నవ్వుతుంటే తలకొట్టేసినట్టయ్యింది. ఆ రోజు నుంచీ బ్రెయిలీ పాఠాలు ముందేసుకుని అదేపనిగా చదివాను. టీచర్ చెప్పే ప్రతిపాఠాన్నీ ఒళ్లంతా చెవులు చేసుకుని వినసాగాను. అప్పుడే మా సోషల్ స్టడీస్ టీచర్ ఎవరితోనో 'నాగబాబు తక్కువ మార్కులు తెచ్చుకున్నాడని నవ్వడం చాలా తప్పు. వాడు ఏదైనా సాధిస్తాడు' అనడం విన్నాను. ఆ మాటలు ఓ మంత్రంలా పనిచేసి మరింత కష్టపడ్డాను. అన్ని టెస్టుల్లోనూ మంచి మార్కులు తెచ్చుకోసాగాను. తొమ్మిదో తరగతిలో నాకు కంప్యూటర్ పరిచయమైంది. తెరపైన వచ్చే ప్రతి అక్షరాన్నీ అంధుల కోసం చదివి వినిపించే జాప్స్(జాబ్ యాక్సెస్ విత్ స్పీచ్) పరికరం నాకు కొత్త రెక్కల్ని తొడిగింది. న్యూస్ వినడం, సామాజిక సమస్యలపైన తార్కికంగా చర్చించడం నేర్చుకున్నాను. పదో తరగతి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. పాలిటెక్నిక్‌లో కంప్యూటర్ ఇంజినీరింగ్ చదవడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఓ స్నేహితుడి దగ్గర పుస్తకాలు సంపాదించి మా వీధిలో ఓ పాపతో చదివించుకుంటూ మననం చేసుకోవడం మొదలుపెట్టాను. పాలీసెట్ పరీక్ష రాసి మంచి ర్యాంకూ తెచ్చుకున్నాను.

టైప్ నేర్చుకుంటే చాలు

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ మొదలైంది. నేనూ అమ్మానాన్నా వెళ్లాం. నా సర్టిఫికెట్స్ చూడగానే '40 శాతం కంటే ఎక్కువ అంధత్వం ఉంటే సీటివ్వం' అన్నారు. నాదేమో వందశాతం అంధత్వం. 'నేను ర్యాంకు తెచ్చుకున్నాను ...' అంటే 'గుడ్డివాళ్లకి టైప్‌రైటింగ్ కోర్సో టెలిఫోన్ ఆపరేటింగ్ కోర్సో కరెక్ట్‌గా ఉంటుంది... పాలిటెక్నిక్‌లు అక్కర్లేదు' అన్నాడు అక్కడి ఆఫీసర్. ఆ మాటలు నాలో కసిని రేపాయి. అమ్మానాన్నల్ని తీసుకుని డిజేబుల్డ్ వెల్ఫేర్ కమిషనర్ దగ్గరకు వెళ్లాను. విషయం చెబితే 'ఔను... సీటెలా ఇస్తారు?' అన్నాడు. 'కాదండీ, డిజేబుల్డ్ యాక్ట్ 1995 ప్రకారం వికలాంగులపైన ఇలాంటి వివక్ష చూపకూడదు' అని వాదించాను. ఆయన

(c) eenadu

ఇంప్రెస్ అయి, సీటివ్వమని లెటర్ రాసి ఇచ్చారు. అయినాసరే, కౌన్సెలింగ్ బోర్డు దాన్ని పట్టించుకోలేదు. ఈసారి టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ వద్దకెళ్లాను. ఆయన డిజేబుల్డ్ కమిషనర్ లెటర్ చూడగానే నాకు సీటు ఇవ్వాల్సిందేనంటూ ఆర్డర్ పాస్‌చేశారు. అలా, గుడ్లవల్లేరులోని ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్సార్ పాలిటెక్నిక్ కాలేజీలో సీటిచ్చారు. ఆ ఆర్డర్ కాపీతో బయటకొస్తుంటే ప్రపంచాన్ని జయించినట్టు అనిపించింది!

మళ్లీ చుక్కెదురు...

పాలిటెక్నిక్ మొదటి ఏడాది ఫీజులు కట్టడానికీ అమ్మా అమ్మమ్మా ఎక్కడెక్కడి నుంచో అప్పులు తేవాల్సి వచ్చింది. నా పరిస్థితిని అర్థం చేసుకుని కాలేజీ యాజమాన్యం రెండో ఏడాది నుంచీ ఫీజు మినహాయింపు ఇచ్చింది. అయినా సరే, మా ఊరి నుంచి గుడ్లవల్లేరు దాకా బస్ ఛార్జీకి కూడా చేబదులు అడగాల్సి వచ్చేది. ఓసారి కళ్లులేని నా చెల్లెలు డాబా పైనుంచి పడిపోయి తలకి తీవ్రగాయమైంది. ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చితే సర్జరీ చేయాలన్నారు. నా దగ్గర పదిరూపాయలు కూడా లేవు... దాంతో ప్రభుత్వాసుపత్రిలో చేర్చాం. ఎలాగైతేనేం, తను బతికి బట్టకట్టింది కానీ ప్రాణంమీదికొచ్చినా చికిత్స చేయించుకోలేని ఆ పరిస్థితి... నా గుండెల్లో ఓ పెద్ద గాయంలా మిగిలిపోయింది. ఇన్ని బాధల మధ్యే డిప్లొమా ముగించాను. ఆ తర్వాత బీటెక్ చేయాలని 'ఈసెట్' ప్రవేశపరీక్షకి సిద్ధమయ్యాను. 2005 మే 4న పరీక్ష. నాకు స్క్రైబ్ కావాలని అడిగేందుకని రెండో తేదీనే జేఎన్‌టీయూకి వెళ్లాను. నా హాల్‌టికెట్ చూపగానే 'నీకు ఎంట్రన్స్ రాయడానికి అర్హత లేదు' అన్నారు. సమస్య మళ్లీ మొదలైందని అర్థమైంది. ఈ విషయాన్ని దేవ్‌నార్‌లోని స్వర్ణలత టీచర్‌కి చెబితే... ఆమె భర్త నన్ను ఆ తర్వాతి రోజు ఉదయం హైకోర్టుకి తీసుకెళ్లారు. నా చేత పిటిషన్ వేయించారు. ఆ రోజు రాత్రికే- నా చేత పరీక్ష రాయించాల్సిందేనంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నేను పరీక్షలు రాసినా... నా రిజల్ట్‌ని ఆపేశారు. మళ్లీ నేను హైకోర్టుని ఆశ్రయించాకకానీ... విడుదల చేయలేదు. రాష్ట్రస్థాయిలో 70వ ర్యాంకు వచ్చింది నాకు. ఈ ర్యాంకు కార్డుతో కౌన్సెలింగ్‌కి వెళితే 'అంధవిద్యార్థుల్ని ఇంజినీరింగ్‌లో అనుమతించేది లేదు' అంటూ మళ్లీ అదే సమాధానం. ఈసారి టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీని ఆశ్రయించాను! దాంతో నా కోసం ప్రత్యేక టెస్టు పెట్టారు...

ఆరు గంటలపాటు...

జేఎన్‌టీయూకి చెందిన ప్రొఫెసర్లు ఆరుగంటలపాటు నన్ను పరీక్షించారు. నాకు రకరకాల కమాండ్స్ ఇస్తూ చేయమన్నారు. కళ్లు లేకున్నా 'జాస్' సాయంతో... నేను ఒకట్రెండు కమాండ్స్‌తో లైట్లని వెలిగించడం చూసి ఆశ్చర్యపోయారు. వారం తర్వాత నేను కాలేజీలో చేరొచ్చంటూ ప్రభుత్వం ప్రత్యేక జీఓ విడుదలచేసింది! అలా, గుడ్లవల్లేరు కాలేజీలోనే బీటెక్‌లో చేరాను. ఈసారి నా ఫీజు మొత్తాన్నీ మాఫీ చేయడమే కాదు... నేను ఉండటానికి ఉచితంగా బస వసతీ కల్పించింది కాలేజీ యాజమాన్యం. నేను ఆలస్యంగా చేరడం వల్ల తగిన అటెండెన్స్ లేదు కాబట్టి... పరీక్షలు రాయడానికి వీల్లేదంటూ టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు మరో కొర్రీ పెట్టింది. 'ఆలస్యానికి కారణం మీ సంస్థే కదా!' అంటూ నేను మూడోసారి హైకోర్టు మెట్లెక్కాను. నాకు అనుకూలంగానే తీర్పు వచ్చింది కానీ... సెకండ్ సెమిస్టర్ సమయంలోనే ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు కూడా రాయాలని చెప్పింది టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు. అంటే ఒకేసారి రెండు సెమిస్టర్‌లు రాయాలి..! ఆ రోజు నుంచీ రాత్రుళ్లు మూడుగంటలే నిద్రపోయి చదవడం మొదలుపెట్టాను. మొత్తానికి బ్యాక్‌లాగ్స్ ఏమీ లేకుండానే రెండు సెమిస్టర్‌లూ పూర్తిచేయగలిగాను. అలా తెలుగు రాష్ట్రాల్లోనే కాదు... దేశంలోనే వందశాతం అంధత్వంతో ఇంజినీరింగ్ పూర్తిచేసిన తొలి విద్యార్థిగా నిలిచాను. క్యాంపస్ ఇంటర్వ్యూలో విప్రోలో సెలెక్ట్ అయినా... అదనంగా మరికొన్ని పరీక్షలు పెట్టాక కానీ వాళ్ళు ఉద్యోగం ఇవ్వలేదు. దానికి మరో ఏడాది ఆగాల్సి వచ్చింది. ఈ లోపల చెల్లెళ్ల చదువుల కోసమని ఏదో ఉద్యోగం చేయాలనుకున్నాను. ఉయ్యూరులోని ఓ కాలేజీలో ఆరువేల రూపాయల జీతానికి లెక్చరర్‌గా వెళ్లాను. ఓ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌నీ నడపసాగాను.

క్యాన్సర్...

ఆలస్యమైనా విప్రోలో ఉద్యోగం ఇచ్చారు. అక్కడ డెవలపర్‌గా టీమ్ లీడ్‌గానూ అంచెలంచెలుగా ఎదిగాను. తర్వాత ఇన్ఫోసిస్‌లో చేరాను. ఓ అంధుడు నాయకత్వ పాత్ర ఎలా పోషించగలడన్న అనుమానాల్ని తొలగించాను. నేను ఇన్ఫోసిస్‌లో పనిచేస్తున్నప్పుడు నాకు ప్రమోషన్ మీద అమెరికా వెళ్లే అవకాశం వచ్చింది. మొదట నాకూ ఉత్సాహంగానే ఉంది కానీ... ఎందుకో తెలియదు అక్కడికెళ్లడం సరికాదని మనసు చెప్పసాగింది. అమ్మ- అమ్మమ్మ- చెల్లెళ్లకి ఇక్కడ నా తోడు అవసరం అనిపించింది. అప్పుడే అమెరికాలోని అతిపెద్ద బ్యాంకింగ్ సంస్థ అయిన జేపీ మోర్గాన్ నుంచి భారత్‌లో ఓ పెద్ద పొజిషన్ ఉందంటూ ఆఫర్ వచ్చింది. సుమారు 500 లక్షల కోట్ల ఆస్తుల్ని మేనేజ్‌చేసే- ప్రపంచంలోని దిగ్గజ ఆర్థిక సంస్థల్లో ఒకటి అది. అక్కడ సైబర్ వ్యవస్థల్ని నిర్మించే అవకాశం ఓ సవాలుగా ఉంటుందని భావించి ఆ సంస్థలో చేరాను. ప్రస్తుతం ఆ సంస్థ టెక్నికల్ విభాగంలో వైస్ ప్రెసిడెంట్‌గా చేస్తున్నాను. అంతా ఫర్వాలేదని అనుకుంటుండగానే 2024లో విపరీతమైన నడుంనొప్పి వచ్చింది. అడుగుకూడా ముందుకు వేయలేని పరిస్థితి. టెస్టులు చేస్తే వెన్నుపూసలోని ఎల్-3, ఎల్-4 డిస్కులు అరిగిపోయాయనీ... వాటిని కలుపుతూ ఆపరేషన్ చేయాలనీ వైద్యులు చెప్పారు. చేశారు. ఆపరేషన్ తర్వాత కోలుకుంటూ ఉండగానే నా శరీరంలో విపరీతమైన వణుకు మొదలైంది. దానికి కారణం థైరాయిడ్ క్యాన్సర్ అని తేలింది. వైద్యుల్నీ నా మనోబలాన్నీ నమ్ముకున్నాను. అలా గత ఏడాది థైరాయిడ్ గ్రంథిని తొలగించారు. క్యాన్సర్ ఇంకెక్కడా సోకలేదనీ చెప్పడం ఓ పెద్ద ఊరటగా నిలిచింది!

అంధుణ్ని కావడం. దానికి పేదరికం తోడవ్వడం. బాధ్యతలేని తండ్రి. పాత చట్టాలు... ఉద్యోగంలో పోటీ... ఇవి చాలవన్నట్లు క్యాన్సర్. వీటన్నింటినీ దాటుకుని నన్ను నడిపిస్తున్నది ఏమిటీ అని అడిగితే 'ఓర్పు' అనే చెబుతాన్నేను. నడిచే దారి మొత్తం పాకుడురాళ్లతోనే నిండి ఉన్నా... ఎన్నిసార్లు జారిపడ్డా... ఎన్ని సవాళ్లు ఎదురైనా... ఆ ఓర్పే నన్ను నిలబెడుతోందని నమ్ముతాను. నాకు ఆ ఓర్పుని నేర్పింది... మా అమ్మేనని చెబుతాను! ★

నా కోసం అన్నీ వదులుకుని..!

నేను కాలేజీలో లెక్చరర్‌గా ఉన్నప్పుడు రేఖ అక్కడ విద్యార్థిని. డిగ్రీ అయ్యాక నా కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లోనే చేరింది. నాకు ఉద్యోగం రావడం ఆలస్యమై ఆందోళనలో ఉన్నప్పుడు తన మాటలే నాకు వెన్నుదన్నుగా నిలిచాయి. ఇద్దరం పెళ్లి చేసుకోవాలను కున్నాం. నాకు చూపులేకపోవడం, దానికి తోడు పేదరికం... వీటిని చూపి వాళ్ల ఇంట్లో ఒప్పుకోలేదు. దాంతో ఇద్దరం మా స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నాం. అలా నా జీవితంలోకి వచ్చిన రేఖ... ఇరవై ఏళ్లవుతున్నా మళ్లీ తన పుట్టింటికి వెళ్లింది లేదు. తల్లిలా నా చెల్లెళ్ల బాధ్యతలు తీసుకుంది. ఉద్యోగానికీ వెళ్లింది. నాకు తల్లి తర్వాత తల్లిగా నిలిచింది!

(c) eenadu

ప్రాక్టికల్ పీపుల్

- కళ్ళే వెంకటేశ్వర శాస్త్రి

సంజీవరావు, సుజాత నాకు దూరపు బంధువులు. నేను బెంగళూరు దగ్గర కనకపురలో ఉంటాను. వాళ్ళు బెంగళూరు సిటీ మల్లేశ్వరంలో నివసిస్తున్నప్పటికీ, నేను గత కొన్ని సంవత్సరాలుగా వాళ్ళింటికి వెళ్ళలేదు. ఒకప్పుడు-అప్పుడప్పుడూ వెళ్ళి రెండు మూడు రోజులు వాళ్ళతో గడిపేదాన్ని. ఆ రోజుల్లో పిల్లల సందడీ బంధువుల రాకపోకలూ నవ్వులూ మాటలూ... వాళ్ళ ఇల్లు ఎప్పుడూ కళకళలాడుతూ ఉండేది.

కాలం గడిచిపోయింది.

పిల్లలు చదువుల కోసం విదేశాలకు వెళ్ళారు. అక్కడే ఉద్యోగాలు తెచ్చుకున్నారు. అక్కడే స్థిరపడ్డారు. సంజీవరావు, సుజాత మాత్రం మల్లేశ్వరంలోని అదే ఇంట్లో మిగిలిపోయారు.

ఈసారి బెంగళూరులో ఓ స్నేహితుడి ఇంట్లో ఒక కార్యక్రమానికి వెళ్ళాల్సి వచ్చింది. పనిలో పనిగా, ఒకసారి సుజాతా వాళ్ళను చూసి రావాలనిపించింది. 'ఈ వయసులో ఇద్దరూ ఒంటరిగా ఎలా ఉంటున్నారో చూద్దాం' అనుకున్నాను.

అందుకే కార్యక్రమానికి కొంచెం ముందుగానే బయలుదేరాను.

వాళ్ళకు ఇష్టమైన స్వీట్స్, సుజాతకు 'మద్దూరు వడ' అంటే ఇష్టం అని గుర్తుండి, అవి కూడా తీసుకుని క్యాబ్‌లో వాళ్ళింటికి వెళ్ళాను.

ఇంటి ముందు దిగగానే మొదట నా దృష్టిని ఆకర్షించింది తోట.

అది చిన్న తోటే అయినా ఎంతో అందంగా ఉంది. రకరకాల పూల మొక్కలూ కుండీల్లో పెంచిన కూరగాయలూ చక్కగా కత్తిరించిన చిన్నచిన్న చెట్లూ... ప్రతిదీ ఒక క్రమంలో ఉంది.

సంజీవరావు గారికి గార్డెనింగ్ అంటే ఎంత ఇష్టమో నాకు ముందే తెలుసు. కానీ ఈ వయసులో కూడా ఆయన ఇంత శ్రద్ధగా తోటను చూసుకుంటున్నారంటే ఆశ్చర్యం వేసింది.

డోర్‌బెల్ మోగించాను.

కొద్దిసేపటికి తలుపు తెరిచింది సుజాత.

నన్ను చూడగానే ఆమె ముఖంలో ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిశాయి.

"అరే, నువ్వా! రా... రా... లోపలికి రా" అంటూ నన్ను ఆప్యాయంగా లోపలికి తీసుకెళ్ళింది.

"చాలా రోజులైంది నిన్ను చూసి. మేమే నీ దగ్గరకు రావడానికి కుదరడం లేదు. ఈ వయసులో ఒంటరిగా ట్రావెల్ చేయడం అంత సులభం కాదు. నువ్వైనా అప్పుడప్పుడూ వచ్చి పోవచ్చు కదా" అంది కొంచెం నిష్ఠూరంగా.

"ఆ మాట నిజమే. రావచ్చు కదా... నా తప్పే" అన్నాను నవ్వుతూ.

ఇద్దరం కూర్చున్నాం. మాటల్లో పడిపోయాం.

మొదట నా విషయాలు అడిగింది.

ఆ తర్వాత తన పిల్లల గురించి చెప్పడం మొదలుపెట్టింది.

సంజీవరావు, సుజాత దంపతులకు ఇద్దరు పిల్లలు. మల్లిక, ప్రణవ్.

ఇద్దరూ చాలా తెలివైన పిల్లలు.

మల్లిక అమెరికాలో ఎంబీబీఎస్, ఎండీ చేసింది. అక్కడే ఒక అబ్బాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. ప్రస్తుతం అక్కడే డాక్టర్‌గా పనిచేస్తూ స్థిరపడింది.

ప్రణవ్ ఇంజినీర్. జర్మనీలో ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడ్డాడు.

"పిల్లలు బాగున్నారు. వాళ్ళ జీవితాలు వాళ్ళవి. మేము వాళ్ళ గురించి గర్వపడతాం" అని చెప్పింది.

ఆమె మాటల్లో పిల్లలపైన ప్రేమ ఉంది. కానీ ఆ ప్రేమలో ఆశలు లేవు. అది నాకు అప్పుడు పూర్తిగా అర్థం కాలేదు.

ఇంతలో కిచెన్ వైపు నుంచి సంజీవరావు గారి గొంతు వినిపించింది.

"సుజీ, పప్పులో దోసకాయ వెయ్యనా, టొమాటోలా?"

నేను ఆశ్చర్యంగా సుజాత వైపు చూశాను.

ఆమె మాత్రం ఏమీ జరగనట్టుగా నన్ను కూర్చోమని సైగ చేసింది.

"మన సౌమ్య వచ్చింది. కొంచెం కాఫీ తీసుకురండి" అంది.

నేను మరింత ఆశ్చర్యపోయాను.

"ఏమైంది?" అని అడిగాను.

ఆమె నవ్వింది.

"ఏమైంది అంటే?"

"సంజీవ్‌గారు కిచెన్‌లో ఏం చేస్తున్నారు?"

"వంట చేస్తున్నారు."

"ఆయనా?"

"అవును."

నేను ఏం మాట్లాడాలో తెలియక ఆమె ముఖం వైపు చూస్తుండగానే సంజీవరావు గారు కాఫీ తీసుకొచ్చారు.

"ఇదిగో... మీ ఇద్దరికీ."

మాకు ఇచ్చి, తనకూ ఒక కప్పు తీసుకుని మా ఎదురుగా సోఫాలో కూర్చున్నారు.

"ఎలా ఉన్నావు సౌమ్యా? ఈమధ్య రిటైర్ అయ్యావని సుజాత చెప్పింది. రిటైర్మెంట్ జీవితం ఎలా ఉంది? పిల్లలంతా బాగున్నారా?"

"బాగున్నారు" అన్నాను.

"పిల్లలు ఇండియాలోనే ఉన్నారు కదా?"

"అవును."

"అది కొంత మేలు. వాళ్ళకు ఇక్కడికి రావడానికి వీలు కాకపోతే, మీరైనా వాళ్ళ దగ్గరకు వెళ్ళి రావచ్చు" అన్నారు.

"అవును" అన్నాను.

అంతలో సుజాత కాఫీ తాగుతూ మెల్లగా మాట్లాడటం మొదలుపెట్టింది.

"చూడు... మనం ఇప్పుడు వృద్ధులం. సంజీవ్‌కి ఎనభై వచ్చింది. నా వయసు కూడా డెబ్భైఎనిమిది. ఇక ముందు మన జీవితంలో రోజులు ఎలా తగ్గిపోతాయో మనకే తెలియదు."

ఆమె కొద్దిసేపు ఆగింది.

"ఎవరి వంతు ముందు వస్తుందో కూడా తెలియదు."

ఆ మాట విన్న వెంటనే నా మనసులో ఏదో కలవరం మొదలైంది.

"అలా ఎందుకు మాట్లాడుతున్నావు?" అన్నాను.

ఆమె మాత్రం చాలా ప్రశాంతంగా ఉంది.

"ఎందుకు మాట్లాడకూడదు? అది జీవితంలో తప్పించుకోలేని నిజం కదా."

సంజీవరావుగారు కూడా తలూపారు.

"పిల్లలు జీవితాంతం మనకు తోడుగా ఉంటారని అనుకోవడం- మనకు మనమే చెప్పుకునే ఓదార్పు. వాళ్ళు మనల్ని ప్రేమిస్తారు... మన గురించి ఆలోచిస్తారు... అప్పుడప్పుడూ వస్తుంటారు కూడా. కానీ వాళ్ళ జీవితాలు వాళ్ళవి. వాళ్ళ బాధ్యతలూ వాళ్ళ ఉద్యోగాలూ వాళ్ళ కుటుంబాలూ... అన్నీ వాళ్ళవే."

"అయితే వాళ్ళు మిమ్మల్ని చూడటానికి రావడం లేదా?" అని అడిగాను.

"వీలైనప్పుడు వస్తారు. రోజూ ఫోన్ చేస్తారు. మమ్మల్ని తమ దగ్గరకు రమ్మంటారు" అంది సుజాత.

"మరి మీరు ఎందుకు వెళ్ళరు?"

"వెళ్ళి రావచ్చు. ఎన్నోసార్లు అడిగారు. టికెట్లు కూడా పంపిస్తామని చెప్పారు. కానీ అంతదూరం వెళ్ళి రావడం మాటల్లో చెప్పినంత సులభం కాదు."

సంజీవరావుగారు నవ్వారు.

"ఈ వయసులో ఓపిక తగ్గిపోతుంది. ప్రయాణం చేయడం, ఎయిర్‌పోర్ట్‌లో తిరగడం, సామాను చూసుకోవడం... ఇవన్నీ చిన్న విషయాల్లా కనిపించినా మాకు అంత సులభం కాదు."

"అది నిజమేలే" అన్నాను.

(c) eenadu

"వంట మనిషిని పెట్టుకోండి. పనివాళ్ళను పెట్టుకోండి. మీరు ఎందుకు ఇంత పని చేసుకుంటారు... అని పిల్లలు ఎన్నోసార్లు చెప్పారు" అంది సుజాత.

"మరి పెట్టుకోలేదేం?"

"మాకు ఇష్టం ఉండదు."

"ఎందుకు?"

"మేమిద్దరం కలిసి పని చేసుకుంటూ ఉంటే మేము యాక్టివ్‌గా ఉంటాం. ఉదయం లేవగానే ఏదో ఒక పని ఉంటుంది. తోటపని, వంటపని, ఇంటిపని. ఒకరి పని ఇంకొకరం చూసుకుంటాం. అలా రోజంతా గడిచిపోతుంది."

సంజీవరావుగారు నవ్వుతూ, "మా సుజాత వంటలో నన్ను కూడా దింపేసింది" అన్నారు.

"నేనా?" అంటూ సుజాత నవ్వింది.

"ఇప్పుడు యూట్యూబ్‌లో కొత్త కొత్త వంటలు చూసి ప్రయోగాలు చేసేది ఆయనే."

"అవును" అన్నారు ఆయన. "ఇంతకుముందు నాకు కిచెన్ అంటే ఏమిటో కూడా తెలియదు. ఓ కప్పు కాఫీ కూడా పెట్టలేకపోయేవాడిని. ఇప్పుడు అవసరంకొద్దీ ఒక్కొక్కటీ నేర్చుకున్నాను. అన్నం, పప్పు, కూర... అన్నీ. కాఫీ, టీ అయితే బాగా పెట్టగలను."

"మరి సుజాతగారు?"

ఆమె నవ్వింది.

"నేను కూడా కొన్ని విషయాలు నేర్చుకున్నాను."

"ఏమిటవి?"

"ఇంతకుముందు నేను ఎప్పుడూ ఏటీఎం నుంచి డబ్బు తీసుకునేదాన్ని కాదు. బ్యాంకు పనులు అన్నీ సంజీవ్ చూసుకునేవారు. ఇప్పుడు ఏటీఎం నుంచి డబ్బు తీసుకోవడం నేర్చుకున్నాను. ఆన్‌లైన్‌లో కరెంట్ బిల్లులూ ఫోన్ బిల్లులూ ఇతర చెల్లింపులూ చేయడం కూడా నేర్చుకున్నాను."

నేను ఇద్దరి ముఖాల వైపూ చూస్తూ ఉండిపోయాను.

అప్పుడు సంజీవరావుగారు చాలా ప్రశాంతంగా అన్నారు...

"ఇలా... ఒంటరిగా ఎలా జీవించాలో నేర్చుకుంటున్నాం."

ఆ మాట నా మనసులో గట్టిగా తగిలింది.

"ఒంటరిగా ఎలా జీవించాలో నేర్చుకోవడం ఎందుకు? అంత అవసరం ఏముంది?" అని అడిగాను.

ఆయన కాసేపు నిశ్శబ్దంగా ఉన్నారు.

"మనిషి జీవితంలో కొన్ని విషయాలు మనం ఎంచుకోలేం. మనకు నచ్చినా నచ్చకపోయినా అవి మన దగ్గరకు వస్తాయి. వృద్ధాప్యం అలాంటిదే. మరణం కూడా అలాంటిదే."

ఆయన మాటల్లో భయం లేదు.

"మనుషుల విలువ ఎప్పుడు తెలుస్తుందో తెలుసా? చీకటి గదిలో ఉన్నప్పుడు వెలుతురు గొప్పతనం తెలుస్తుంది. ఆటలో ఓడిపోయినప్పుడు గెలుపు విలువ తెలుస్తుంది. అలాగే మనతో ఉన్న మనిషి విలువ... వాళ్ళు మన పక్కన లేనప్పుడు తెలుస్తుంది" అన్నారు.

నేను నిశ్శబ్దంగా వింటున్నాను.

ఆయన కొనసాగించారు.

"కొన్ని పరిచయాలు కష్టకాలంలో మనతో నిలబడతాయి. కొన్ని పరిచయాలు మధ్యలోనే కనుమరుగవుతాయి. కొన్ని మన కన్నీళ్ళను తుడిచే చేతులవుతాయి. మరికొన్ని జీవితాంతం కన్నీళ్ళను మిగులుస్తాయి. కొన్ని తలపులుగా మిగిలిపోతాయి."

సుజాత ఆయన మాటలను వింటూ తల ఊపింది.

"దూరంగా ఉన్నా హృదయానికి చాలా దగ్గరగా ఉండే వాళ్ళు ఉంటారు. దగ్గరగా ఉన్నా మనసుకు అంతులేని దూరంగా ఉండే వాళ్ళూ ఉంటారు. అందుకే ప్రతి మంచి పరిచయాన్నీ ప్రతి మంచి బంధాన్నీ పదిలంగా ఉంచుకోవాలి. అదే అందమైన జీవితం."

కొద్దిసేపు మౌనం.

"ఇన్ని సంవత్సరాలు ఒక కుటుంబంలో కలిసి జీవించిన తర్వాత కూడా మనం నిజంగా ఒంటరిగా బతకడం నేర్చుకోలేదు. ఎందుకంటే ఎప్పుడూ ఒకరు ఇంకొకరిపై ఆధారపడి ఉంటారు. ఇప్పుడు మేము ఒక్కొక్క పనీ స్వయంగా చేసుకోవడం నేర్చుకుంటున్నాం."



ఆయన నవ్వారు.

"ఒకరోజు సుజాత లేకపోతే నేను వంట చేసుకోవాలి. నేను లేకపోతే ఆమె బ్యాంకు పనులు చేసుకోవాలి. ఎవరు ముందు వెళ్తారో ఎవరికీ తెలియదు."

"అలా అనకండి" అన్నాను నేను.

"ఎందుకు అనకూడదు?" ఆయన ప్రశాంతంగా అడిగారు.

"అలా మాట్లాడితే బాధగా ఉంటుంది."

సుజాత నా వైపు చూసి మెల్లగా అంది.

"సౌమ్యా, ఆయన ప్రాక్టికల్‌గా మాట్లాడుతున్నారు. ఇది జరగకుండా ఉండే విషయం కాదు కదా. జరిగిన తర్వాత బాధపడేకంటే, జరగకముందే మనల్ని మనం సిద్ధం చేసుకోవడం మంచిది."

ఆమె మాటల్లో వింతైన ప్రశాంతత ఉంది.

"మా ఇద్దరిలో ఎవరు ముందు వెళ్తారో మాకు తెలియదు. కానీ ఒకరు వెళ్ళిపోయిన తర్వాత రెండోవారు 'ఇక నా వల్ల కాదు' అనకుండా, మిగిలిన జీవితాన్ని గౌరవంగా గడపాలి. అందుకే ఇద్దరం ఒకరికొకరం కొన్ని విషయాలు నేర్పుకుంటున్నాం."

నాకు ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు.

వాళ్ళు చాలా ప్రాక్టికల్‌గా మాట్లాడుతున్నారు.

కానీ ఆ ప్రాక్టికల్ మాటల వెనుక ఎంత ప్రేమ ఉందో నాకు అప్పుడే అర్థమైంది. ఒకరిని ఒకరు కోల్పోతామనే భయంతో జీవించడం కాదు... ఒకరోజు ఆ పరిస్థితి వచ్చినా, మరొకరు బలంగా నిలబడాలని ఒకరినొకరు సిద్ధం చేసుకుంటున్నారు.

అది ప్రేమకు మరో రూపం. వాళ్ళు తమ పిల్లలను నిందించడం లేదు. 'పిల్లలు మమ్మల్ని చూసుకోవాలి' అనే హక్కును డిమాండ్ చేయడం లేదు. 'మేము వాళ్ళను పెంచాం కాబట్టి, వాళ్ళు మా దగ్గరే ఉండాలి' అనే ఆశ లేదు. పిల్లలు తమ జీవితాలను సంతోషంగా గడపాలని కోరుకుంటూనే, తమ జీవితానికి తాము బాధ్యత వహించడం నేర్చుకున్నారు.

అదే వాళ్ళ 'ప్రాక్టికల్' జీవితం.

ఇక వెళ్తానంటూ నేను లేచే సమయానికి సాయంత్రం అయిపోయింది.

"ఇంత తొందరగా వెళ్తావా?" అంది సుజాత.

"మళ్ళీ వస్తాను" అన్నాను.

"ఈసారి చాలా సంవత్సరాలు చేయకు" అంటూ ఆమె నవ్వింది.

సంజీవరావుగారు మొక్కల వైపు వెళ్ళారు.

బయటికి వచ్చి మళ్ళీ ఒకసారి ఆ తోట వైపు చూశాను.

ప్రతి మొక్కనూ ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నారో అర్థమైంది.

తోటలోని ఒక చిన్న మొక్కకు నీళ్ళు పోస్తూ కనిపించారు సంజీవరావుగారు.

జీవితం కూడా అలాంటిదే కదా... ప్రతిరోజూ కొంచెం నీళ్ళు పోయాలి. కొంచెం ప్రేమ ఇవ్వాలి. కొంచెం జాగ్రత్త తీసుకోవాలి. అంతే తప్ప, మనతో ఎప్పటికీ ఉంటుందని ఏదీ హామీ ఇవ్వదు.

క్యాబ్‌లో కూర్చున్నాను.

ఎందుకో నోరు చేదుగా అనిపించింది. 'కాఫీ బాగానే ఉంది కదా' అనుకున్నాను. తర్వాత అర్థమైంది. అది కాఫీ చేదు కాదు. ఆ జంట చెప్పిన 'చేదు సత్యం' నా మనసులో కలిగించిన చేదు.

మన జీవితంలో మనతో ఉన్న మనుషులు శాశ్వతం కాదని తెలుసు. అయినా ఆ నిజాన్ని అంగీకరించడానికి మనసు ఎప్పుడూ సిద్ధంగా ఉండదు.

సంజీవరావు, సుజాత- ఆ నిజాన్ని అంగీకరించారు. బాధపడకుండా కాదు... కానీ జీవితాన్ని అర్థం చేసుకుని. వాళ్ళు నాకు ఆ రోజు ఒక గొప్ప విషయం నేర్పారు.

మనుగడ అంటే కేవలం బతకడం కాదు. మనకు తోడుగా ఉన్నంతకాలం ఒకరినొకరు ప్రేమగా చూసుకోవడం... ఒకరోజు తోడు లేకపోయినా, మిగిలిన జీవితాన్ని గౌరవంగా స్వతంత్రంగా కొనసాగించడానికి మనల్ని మనం సిద్ధం చేసుకోవడం.

అదే నిజమైన జీవితం.

అదే వాళ్ళ ప్రాక్టికల్ జీవితం.

బరువైన హృదయంతో వారికి వీడ్కోలు చెప్పాను. ★

(c) eenadu

బిక్కుబిక్కుమంటూ ఉంటారు... దిక్కులు చూస్తూ ఉంటారు. 'ఫలానా సమస్యకి ఏ డాక్టర్ని చూడాలి?' అన్న చిన్న విషయం కనుక్కోవాలన్నా సంకోచిస్తుంటారు. ఆసుపత్రి సిబ్బంది చిరాకుపడితే మరింతగా ముడుచుకుపోతారు. తీవ్ర రోగాలతో పల్లెప్రాంతాల నుంచి నగరాలకి వచ్చే పేదరోగుల పరిస్థితి ఇది. అలాంటివాళ్లని ఆదరించి సాయం చేస్తోంది 'డాక్టర్ నెట్ ఇండియా'. కోయంబత్తూరుకి చెందిన ఈ సంస్థ ఇప్పటిదాకా సుమారు కోటిరూపాయల మేర ఉచిత చికిత్స అందేలా చూసింది!



డాక్టర్ నెట్... నిరుపేద రోగులకి తోడూనీడా!

గూడలూరు... నీలగిరుల్లోని ఓ చిన్న పట్టణం. అక్కడి గిరిజన గూడేనికి చెందిన ఓ వృద్ధురాలికి పెద్ద పేగు క్యాన్సర్ ఉందని తేలింది. తమ వద్దకొచ్చి బేలగా కన్నీళ్లు పెట్టుకుంటున్న ఆ పెద్దామెని అక్కున చేర్చుకుంది డాక్టర్ నెట్ సంస్థ. కోయంబత్తూరుకి చెందిన క్యాన్సర్ నిపుణురాలు డాక్టర్ మధూలిక వద్దకు తీసుకెళ్లింది. ఆ పెద్దామెకి ఆరోగ్యబీమా పథకం ఉందికానీ ఈ క్యాన్సర్ చికిత్స దాని పరిధిలోకి రాదని తేలింది. అయినా డాక్టర్ నెట్ సంస్థ కానీ డాక్టర్ మధూలిక కానీ చేతులెత్తేయలేదు. వేరే చిన్న ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించడం మొదలుపెట్టారు. కీమో థెరపీకి అవసరమైన మందులన్నింటినీ డిస్ట్రిబ్యూషన్ సంస్థల ద్వారా డాక్టర్ మధూలిక ఉచితంగా అందిస్తే... రేడియేషన్ థెరపీకయ్యే లక్షన్నర రూపాయలని ఓ సేవా సంస్థ ద్వారా విరాళంగా ఇప్పించింది డాక్టర్ నెట్ సంస్థ. ఆ వృద్ధురాలికి ఇతరత్రా టెస్టులకయ్యే ఖర్చులు, బస, భోజనం బాధ్యతలన్నీ ఈ సంస్థే చూసుకుంది. పూర్తిస్థాయిలో కోలుకునేదాకా అండగా నిలిచింది.

★ ★ ★

ఆ పాపకి అప్పుడు 17 ఏళ్లు. ప్రముఖ పర్యటక ప్రాంతం కొడైకెనాల్ దగ్గర ఓ కుగ్రామం తనది. ఆ పాపకి తీవ్రమైన నడుమునొప్పి వచ్చి ఆసుపత్రికి వెళితే వెన్నెముకలో నీటి తిత్తి(సిస్ట్) ఉందని తేలింది. ఆపరేషన్ చేశారు. అయితే ఆ తర్వాతి నుంచీ తను మలమూత్ర విసర్జనపైన నియంత్రణ కోల్పోయింది. దాంతో ఇంటి బయట ఓ గదిలో ఉంచారు ఆమె తల్లిదండ్రులు. ఆ పాప దైన్యం గురించి విన్న 'డాక్టర్ నెట్' తమ వలంటీర్ల ద్వారా తనని రప్పించి... ఆసుపత్రికి తీసుకెళ్లి... చికిత్స చేయించి బాగు చేసింది. అంతటితో ఆగలేదు ఆ పాపవాళ్ల నాన్నకీ ఉద్యోగం ఇప్పించింది. ఆ పాపకీ వాళ్ల తమ్ముడికీ ఊళ్లోనే చదువు చెప్పే ఏర్పాటుచేయించింది.

...ఇలా ఒకరూ ఇద్దరూ కాదు గత తొమ్మిదేళ్లలో 4200 మంది పేద రోగుల్ని ఆదుకుంది డాక్టర్ నెట్ ఇండియా సంస్థ. వాళ్లందరూ క్యాన్సర్, హృద్రోగం, కాలేయ సమస్యలు, మూత్రపిండాల వ్యాధులు వంటి తీవ్ర రుగ్మతల బాధితులే. కోయంబత్తూరుకి చెందిన దంపతులు అరవిందన్- అభిరామి ఈ సంస్థ వ్యవస్థాపకులు. వాళ్లు డాక్టర్లు కాకపోయినా సహృదయులైన ఏడువందలమంది వైద్యుల్ని ఏకం చేయగలిగారు. ఆ డాక్టర్లు పనిచేస్తున్న లేదా వాళ్లు సిఫార్సు చేసిన ఆసుపత్రుల ద్వారా ఆరోగ్యబీమా లేనివారికీ, ఉన్నా అది పూర్తిగా ఉపయోగపడని రోగులకీ ఈ సంస్థ సాయపడుతోంది. చికిత్సకి లక్షల్లో ఖర్చయినా ఈ సంస్థే విరాళాల ద్వారా సేకరించి ఇస్తుంది. టెస్టులకి ఆర్థిక సాయం చేస్తుంది. రాయితీల ద్వారా మందులూ అందేలా చూస్తుంది. ఓ రోగి తమ దగ్గరకి వచ్చినప్పటి నుంచీ ఆసుపత్రి చికిత్స అయ్యాక ఇంటికి వెళ్లి అక్కడా మందులు వేసుకుంటూ కోలుకునేదాకా ఈ సంస్థ అండగా నిలుస్తుంది. అవసరమైతే వాళ్లకీ, వాళ్ల ఇంట్లోనివాళ్లకీ ఉద్యోగావకాశాలూ కల్పిస్తుంది. పిల్లలకి చదువూ చెప్పిస్తుంది. ఇంతకీ అరవిందన్- అభిరామి దంపతులు ఈ అరుదైన సేవల్లోకి ఎలా అడుగుపెట్టారంటే...

అమెరికా నుంచి...

అరవిందన్ ఒరాకిల్ సంస్థలో పనిచేస్తుండేవాడు. ఉద్యోగనిమిత్తం అమెరికాలో ఉంటున్నప్పుడు అక్కడ అభిరామితో కలిసి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. ఆ తర్వాత బెంగళూరుకి బదిలీ అయ్యింది. మనదేశంలో గొప్ప వైద్య నిపుణులూ, మంచి ఆసుపత్రులూ ఉన్నా, ప్రభుత్వాలు ఆరోగ్య బీమా పథకాల్ని అమలు చేస్తున్నా... అవన్నీ అట్టడుగు వర్గాల ప్రజలదాకా వెళ్లడం లేదని గ్రహించాడు. వైద్యరంగానికీ పేదలకీ మధ్య ఉన్న ఈ అంతరాన్ని తగ్గించడానికి వైద్యులతో ఓ స్వచ్ఛంద వ్యవస్థ(వలంటరీ నెట్‌వర్క్)ని ఏర్పాటు చేయాలనుకున్నాడు. ముందుగా అభిరామి వాళ్లన్నయ్య డాక్టర్ అరుణ్‌కుమార్, ఆయన స్నేహితులు ఇరవై మందీ ముందుకొచ్చారు. వాళ్లతోనే 2017లో డాక్టర్ నెట్‌వర్క్ ఇండియా ఏర్పడింది. అరవిందన్- అభిరామి దంపతుల అంకితభావం చూసి సీఎంసీ వేలూరు, చెన్నై అడయార్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, బెంగళూరు సెయింట్ జాన్స్ ఆసుపత్రి, కోయంబత్తూరులోని గంగా ఆసుపత్రి తదితర పలు సంస్థలకి చెందిన వైద్యులు డాక్టర్ నెట్‌లో భాగస్వాములయ్యారు. అలా, డాక్టర్ నెట్‌లో భాగస్వాములైన వాళ్ల సంఖ్య ఏడొందలకి చేరింది! వీళ్లందరి ద్వారా ఇప్పటిదాకా కోటి రూపాయల విలువైన వైద్య చికిత్సల్ని ఉచితంగా అందించిందీ సంస్థ.

కోయంబత్తూరు దాని చుట్టుపక్కలే కాదు- తమిళనాడు, కేరళల్లోనూ ఎక్కడ ఏ పేదరోగి ఉన్నా తమకు సమాచారం అందించేలా నెట్‌వర్క్ ఏర్పాటుచేసుకున్న అరవిందన్- అభిరామి దంపతులు... ఏటా సుమారు నాలుగొందలమంది నిరుపేద రోగులకు అండగా నిలుస్తున్నారు! ★

(c) eenadu

అష్టమి ఘడియల్లో అవతరించిన శ్రీకృష్ణ పరమాత్ముడికి ఛప్పన్‌భోగ్ పేరుతో 56 రకాల పదార్థాలను నివేదించడం ఆలయాల్లో మామూలే. మనం - అన్ని కాకపోయినా భక్తితో ఒకటిరెండు అయినా ఆ స్వామికి సమర్పిస్తే అదో ఆనందం కదూ...

కన్నయ్యకు... కమ్మని విందు!

క్యారెట్ గులాబ్‌జామూన్

కావలసినవి: **క్యారెట్ తురుము:** రెండు కప్పులు, **కోవా:** కప్పు, **మైదా:** మూడు టేబుల్‌స్పూన్లు, **చక్కెర:** కప్పు, **నీళ్లు:** కప్పు, **యాలకులపొడి:** అరచెంచా, **నెయ్యి:** వేయించేందుకు సరిపడా, **కొబ్బరి పొడి:** కొద్దిగా.

తయారీ విధానం: ఓ గిన్నెలో చక్కెర, నీళ్లు తీసుకుని స్టవ్‌పైన పెట్టాలి. చక్కెర కరిగి, లేతపాకంలా తయారవుతున్నప్పుడు యాలకులపొడి వేసి దింపేయాలి. కడాయిని స్టవ్‌పైన పెట్టి చెంచా నెయ్యి వేసి, క్యారెట్ తురుమును వేయించాలి. అయిదారు నిమిషాలయ్యాక స్టవ్‌ని సిమ్‌లో పెట్టి కోవాను కూడా వేసి కరిగాక దింపేయాలి. ఈ మిశ్రమం కాస్త చల్లారాక అందులో మైదా వేసి అన్నింటినీ కలిపి చిన్నచిన్న ఉండల్లా చేసుకోవాలి. వీటిని నేతిలో వేయించుకుని తర్వాత చక్కెర పాకంలో వేసి... పదినిమిషాలయ్యాక ఇవతలకు తీయాలి. చివరగా కొబ్బరిపొడిని చల్లితే క్యారెట్ గులాబ్‌జామూన్ రెడీ.

రవ్వ చెగోడీలు

కావలసినవి: **బియ్యప్పిండి:** కప్పు, **బొంబాయిరవ్వ:** అరకప్పు, **మైదా:** అరకప్పు, **కారం:** చెంచా, **ఇంగువ:** పావుచెంచా, **వాము:** చెంచా, **ఉప్పు:** తగినంత, **నూనె:** వేయించేందుకు సరిపడా.

తయారీ విధానం: ఓ గిన్నెలో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని కలుపుకోవాలి. అందులో మూడునాలుగు టేబుల్‌స్పూన్ల వేడి నూనె వేసి మరోసారి కలపాలి. ఇప్పుడు కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ చపాతీ పిండిలా చేసుకుని మూత పెట్టాలి. అయిదు నిమిషాలయ్యాక చెగోడీల్లా చుట్టుకుంటూ కాగుతున్న నూనెలో వేసి వేయించుకుని తీసుకోవాలి.

అటుకుల బర్ఫీ

కావలసినవి: పల్చని అటుకులు: రెండున్నర కప్పులు, జీడిపప్పు పలుకులు: పావుకప్పు, బెల్లం తరుగు: కప్పు, నీళ్లు: పావుకప్పు, వేయించిన పల్లీలు: మూడు టేబుల్‌స్పూన్లు, యాలకులపొడి: అరచెంచా, నెయ్యి: రెండు టేబుల్‌స్పూన్లు.

తయారీవిధానం: స్టవ్‌పైన కడాయిని పెట్టి అటుకుల్ని దోరగా వేయించుకుని విడిగా తీసుకోవాలి. కడాయిలో బెల్లం తరుగు వేసి, నీళ్లు పోసి స్టవ్‌ని సిమ్‌లో పెట్టాలి. బెల్లం కరిగి, పాకంలా తయారవుతున్నప్పుడు అటుకులు, జీడిపప్పు, కచ్చాపచ్చాగా దంచుకున్న పల్లీలు, యాలకులపొడి, నెయ్యి వేసి అన్నింటినీ కలిపి, ముద్దలా అయ్యాక దింపేయాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యిరాసిన ప్లేటులో తీసుకుని వేడి కాస్త చల్లారాక ముక్కల్లా కోయాలి.

మురుకులు

కావలసినవి: **బియ్యప్పిండి:** కప్పు, **మందంగా ఉండే అటుకులు:** అరకప్పు, **పుట్నాలపప్పు:** పావుకప్పు, **నువ్వులు:** అరచెంచా, **జీలకర్ర:** అరచెంచా, **కారం:** అరచెంచా, **వెన్న:** టేబుల్‌స్పూను, **ఉప్పు:** తగినంత, **నూనె:** వేయించేందుకు సరిపడా.

తయారీ విధానం: అటుకుల్నీ, పుట్నాలపప్పునీ విడివిడిగా మిక్సీలో వేసుకుని మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ రెండింటినీ జల్లించుకుని ఓ గిన్నెలోకి తీసుకుని ఇందులో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసి కలపాలి. తర్వాత నీళ్లు చల్లుకుంటూ జంతికల పిండిలా చేసుకోవాలి. నూనె రాసిన మురుకుల గొట్టంలోకి ఈ పిండిని తీసుకుని కాగుతున్న నూనెలో ఒత్తుకుని ఎర్రగా వేయించుకోవాలి.

పెసరపప్పు లడ్డు

కావలసినవి: పెసరపప్పు: కప్పు, **చక్కెర:** ముప్పావుకప్పు, **యాలకులు:** నాలుగు, **నెయ్యి:** పావుకప్పు, **జీడిపప్పు పలుకులు:** కాసిని, **కిస్‌మిస్:** పదిహేను.

తయారీ విధానం: పెసరపప్పును దోరగా వేయించుకుని తర్వాత యాలకులతో సహా మిక్సీలో పొడి చేసుకోవాలి. అలాగే చక్కెరనూ పొడి చేసుకుని తీసుకోవాలి. స్టవ్‌పైన కడాయిని పెట్టి నెయ్యి వేయాలి. అది వేడెక్కాక సగం నెయ్యిని విడిగా తీసుకుని మిగిలిన దాంట్లో జీడిపప్పు, కిస్‌మిస్‌ను వేయించుకుని స్టవ్‌ని కట్టేయాలి. ఇందులో పెసరపిండి, చక్కెరపొడి వేసుకుని మిగిలిన నెయ్యిని కొద్దికొద్దిగా వేస్తూ లడ్డూల్లా చుట్టుకోవాలి.

(c) eenadu

సిసింద్రీ

తేడాలేంటి?

ఈ రెండు బొమ్మల మధ్య ఎనిమిది తేడాలు ఉన్నాయి. అవేంటో గుర్తించగలరా?





ఎన్నెన్ని?

కింద కనిపిస్తున్న ఈ చిత్రంలో '8' అంకె ఎన్నిసార్లు ఉందో చెప్పండి చూద్దాం.



సారీ టీచర్!

టీచర్: పిల్లలూ... రోజూ రెండు లీటర్ల నీళ్లు తాగాలని చెప్పా కదా. నిన్న తాగనివాళ్లు నిల్చోండి.

బంటీ: సారీ టీచర్, నేను తాగలేక పోయా!

టీచర్: వీళ్లందరూ తాగినప్పుడు... నువ్వు ఒక్కడివే ఎందుకు తాగలేదు?

బంటీ: నిన్న నాలుగుసార్లు ప్రయత్నించా టీచర్. ప్రతిసారీ అరలీటరు నీళ్లు మాత్రమే తాగగలిగా. ఒక్కసారి కూడా రెండు లీటర్లు తాగలేకపోయా!

దారి కనుక్కోండి

ఆకలితో ఉన్న కుందేలుకు దూరంగా ఒక క్యారెట్ కనిపించింది. కానీ, అక్కడికెలా వెళ్లాలో తెలియడం లేదు. దానికి కొంచెం దారి చూపి సాయం చేయరూ..



జత ఏది?

ఇక్కడ రెండు వరసల్లో మనం రోజూ కూరల్లో వండుకునే పదార్థాలు ఉన్నాయి. వాటిమధ్య ఉన్న సంబంధాన్ని బట్టి, సరైనవాటిని జత చేయండి.



తప్పులే తప్పులు

ఇద్దరు పిల్లలు షటిల్ ఆడుతున్న ఈ చిత్రంలో ఆరు తప్పులు ఉన్నాయి. అవేంటో కనిపెట్టగలరా?



(c) eenadu

దాగుడుమూతలు

సెలవురోజు కావడంతో పిల్లలంతా కలిసి పార్కులో కాలక్షేపం చేస్తున్న ఈ చిత్రంలో కింద కనిపిస్తున్న బొమ్మలు దాగున్నాయి. అవెక్కడున్నాయో కనుక్కోండి చూద్దాం.

మంత్రి కుతంత్రం

సిద్ధేశ్వరం రాజు గౌతముడు. సాయం కోరి ఎవరొచ్చినా... ఖాళీ చేతులతో పంపించేవాడు కాదు. రాజ్యకాంక్ష ఉన్న మంత్రి భోజరాజు- గౌతముడిని గద్దెదించడం కోసం అమాయకుడైన రాజు తమ్ముడు రుద్రుడిని పావుగా వాడుకోవాలనుకున్నాడు. ఒకరోజు రుద్రుడి వద్దకెళ్లి, 'మీరు రాజయ్యే ఉపాయం చెబుతా. గౌతముడి వద్దకెళ్లి, నాకు రాజును కావాలని ఉంది. రాజ్యంలో సగభాగం నాకివ్వండి అని అడగండి' అన్నాడు. అతని మాటలతో ఆశపుట్టిన రుద్రుడు- గౌతముడి వద్దకెళ్లి, మంత్రి చెప్పినట్టే అడిగాడు. రాజ్యాన్ని రెండుముక్కలు చేయడం ఇష్టంలేని రాజు- రుద్రుడినే రాజుగా ప్రకటించాడు. అప్పటినుంచి భోజరాజు చేతిలో కీలుబొమ్మగా మారిపోయాడు రుద్రుడు. గౌతముడికి రాజ్యబహిష్కరణ విధించేలా చేశాడు మంత్రి. అక్కడితో ఆగకుండా, గౌతముడిని తమ్ముడితోనే చంపించి- రాజ్యాన్ని చేజిక్కించుకోవాలనుకున్నాడు.

రుద్రుడి వద్దకెళ్లి, 'మహారాజా... గౌతముడితో మీకు ఏనాటికైనా ముప్పు ఉంటుంది' అని, గౌతముడి తలను తీసుకొచ్చిన వాళ్లకి లక్ష బంగారు నాణేలు ఇస్తానని ప్రకటించేలా చేశాడు. ఇదిలాఉండగా, రామేశ్వరం రాజ్యానికి చెందిన కవి సదానందుడికి డబ్బు అవసరం పడడంతో సిద్ధేశ్వరానికి బయల్దేరాడు. అడవి నుంచి వెళ్తుండగా... ఒకచెట్టు కింద గౌతముడు కనిపించడంతో, తాను రాజుగారి కోసమే వస్తున్న విషయం వివరించాడు. మంత్రి కుతంత్రాల మూలంగా జరిగిందంతా చెప్పిన గౌతముడు- 'ఎలాగైనా నీకు డబ్బు సమకూర్చుతా. ఇదిగో కత్తి, నా తలను తీసుకెళ్లు' అన్నాడు. అతని దాతృత్వానికి కన్నీళ్లు తెచ్చుకున్న సదానందుడు- 'ప్రభూ... రాజ్యం మీకు దక్కాలంటే- ముందు మంత్రి దుష్టబుద్ధి రుద్రుడికి అర్థమవాలి' అని- కొన్ని రసాయనాలతో గౌతముడి తలను పోలిన ఆకారాన్ని తయారు చేసి, సిద్ధేశ్వరానికి వెళ్లాడు. దాన్ని చూసిన మంత్రి, ఇక గౌతముడు లేడనుకుని- రుద్రుడిని చెరసాలలో బంధించి, రాజ్యాన్ని దక్కించుకున్నాడు. విషయం తెలుసుకున్న గౌతముడు సిద్ధేశ్వరానికి వచ్చి- మంత్రిని హతమార్చి, రుద్రుడిని విడిపించాడు. తప్పు తెలుసుకున్న రుద్రుడు- గౌతముడిని క్షమించమని వేడుకుని, అన్నకు రాజ్యాన్ని అప్పగించాడు.

సాధించగలరా?

వర్షాకాలం కావడంతో నాన్నను గొడుగు కొనివ్వమని అడిగాడు బన్నీ. తనకు ఎలాంటిది కావాలో కొన్ని సూచనలు కూడా చేశాడు. వాటి ఆధారంగా బన్నీకి ఇష్టమైన గొడుగు ఏదో చెప్పగలరా?

★ బన్నీకి పూల డిజైన్లు ఇష్టం. ★ పట్టుకోవడానికి తాడు కావాలి.
★ కార్టూన్ బొమ్మలంటే మక్కువ ★ హ్యాండిల్ వంకరగా ఉండాలి.
★ గ్రీన్, బ్లూ, ఎల్లో రంగులు తప్పనిసరి.

రంగులేద్దాం

జవాబులు

తేడాలేంటి?: 1. చెట్టుకింద పూలసంఖ్య 2. బోర్లాపడిన కుండ 3. నాటుతున్న మొక్క ఎత్తు 4. కుక్కమెడలో బెల్టు 5. వేలాడుతున్న కుండీస్థానం 6. ఇంటిస్తంభం 7. వాటరింగ్ క్యాన్ దిశ 8. పాప జడలు.

దాగుడుమూతలు: 1. చెట్టు కాండంపైన పీక 2. బండరాయిలో తాబేలు 3. మేఘంలో పావురం 4. పుస్తకం చివర్లో స్టాప్లర్ 5. పాప రిబ్బన్‌లో చందమామ 6. బాబు టోపీలో వంకాయ 7. కోతి తోకలో పాము 8. పొదలో సీతాకోకచిలుక.

జత ఏది?: 1-C, 2-D, 3-B, 4-A.

తప్పులే తప్పులు: 1. ఎడమ వైపున్న బాబు చేతికి గ్లౌజు 2. కుడివైపున్న బాబు కాళ్లకి ప్యాడ్లు 3. ఎక్కువ ఎత్తుగా నెట్ 4. టెన్నిస్ బాల్ 5. బ్యాటును మధ్యలో పట్టుకోవడం 6. వాటర్ క్యాన్‌కి మధ్యలో ట్యాప్.

సాధించగలరా?: 4 **ఎన్నెన్ని?:** 9

(c) eenadu

నడయాడే తథాగతుడు!

దలైలామాను ఒక బౌద్ధ సన్యాసిగా మాత్రమే చూడలేం. ఆయన టిబెటన్ల మహా నాయకుడు. సవాళ్లనూ సంక్షోభాలనూ తట్టుకుని నిలిచిన ఆధ్యాత్మిక యోధుడు. బుద్ధుడి తర్వాత మళ్లీ అంతటివాడిగా ఆరాధించేవారూ ఉన్నారు.



కాబట్టే, అరవింద్ యాదవ్ తన పుస్తకానికి 'మన కాలం బుద్ధుడు' అని పేరు పెట్టుకున్నారు. దలైలామా అనంత స్వేచ్ఛావాది కూడా. 'దాస్య శృంఖలాలతో చైనాలో మరణించడం కంటే, పవిత్ర భారతదేశంలో కన్ను మూయడమే నాకు ఇష్టం' అని ఓ సందర్భంలో ప్రకటించారు కూడా. టిబెట్ ఈశాన్య ప్రాంతంలోని ఓ వ్యవసాయ కుటుంబంలో జన్మించడం మొదలు... మానవహక్కుల నేతగా, పర్యావరణ పరిరక్షకుడిగా, విశ్వపౌరుడిగా తనను తాను తీర్చిదిద్దుకోవడం వరకూ... ఆ శాంతమూర్తి సుదీర్ఘ జీవనయానాన్ని ఆకట్టుకునే శైలిలో, లోతైన విశ్లేషణలతో అందించారు రచయిత.

మన కాలం బుద్ధుడు
ఆంగ్ల రచన: డా. అరవింద్ యాదవ్
అనువాదం: మెరుగుమాల నాంచారయ్య
పేజీలు: 379, వెల: రూ.499
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

సమీక్ష

రెండు జీవితాలు...

ఫేస్‌బుక్ తలరాతల్ని మార్చేస్తోంది. ఇక్కడ ప్రేమలు పుడుతున్నాయి, ద్వేషాలూ రాజుకుంటున్నాయి. సింహప్రసాద్ హాస్య రచన 'ముఖపుస్తకంలో ముగ్ధ' ఆ ప్రభావాన్ని స్వప్నిల్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కోణంలోంచి చెబుతుంది.

ఆయన మరో రచన 'రెక్కలు తొడుక్కున్న అమ్మాయి' అర్థంలేని స్వేచ్ఛ అనర్థదాయకమని హెచ్చరిస్తుంది. 'నాకు మన ఇల్లు పంజరంలా ఉంది. ఈ బంధనాల్ని తెంచుకోవాలనుంది' అని ఉత్తరం రాసిపెట్టి ఇంట్లోంచి వెళ్లిపోయిన ఓ యువతి జీవితంలోని మలుపులే నవలకు ఇతివృత్తం.

ముఖపుస్తకంలో ముగ్ధ
పేజీలు: 143, వెల:రూ.150
రెక్కలు తొడుక్కున్న అమ్మాయి
పేజీలు: 137, వెల: రూ.150
రచన: సింహప్రసాద్
ప్రతులకు: ఫోన్: 9849061668

ప్రేమలేఖ రాశా...

సెల్‌ఫోన్లు కూడా లేని రోజుల్ని నేపథ్యంగా తీసుకుని డాక్టర్ భావన మధుసూదన్ అల్లిన ఒక అపరిచిత ప్రేమకథ 'అ...ఆ'. రచయిత్రి ఒడుపుగా ఉత్తరాలే ప్రేమ రాయబారులుగా ఈ నవలను నడిపించారు. బ్యాంకు ఉద్యోగిని అయిన అమ్మాయీ, కాల్‌సెంటర్ కొలువు చేస్తున్న అబ్బాయీ చెన్నపట్నంలోని ఓ ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో అద్దెకు దిగుతారు.

కుర్రాడు నిశాచరుడు కావడంతో... ఒకరికొకరు తారసపడే ఆస్కారమే లేదు. ఇద్దరి మధ్యా యాదృచ్ఛికంగా మొదలైన ఉత్తరాయణం ఎన్ని ప్రేమలేఖలకు స్ఫూర్తినిచ్చిందన్నది తెలుసుకోవాలంటే నవలను చివరి వరకూ చదవాల్సిందే.

అ...ఆ... (నవల)
రచన: డా. భావన మధుసూదన్
పేజీలు: 205, వెల: రూ.225
ప్రతులకు: ఫోన్: 9381110979

సుతిమెత్తని భావాలు

డాక్టర్ ఎన్.గోపి 'రెప్పలు దాటని లోకం'... సున్నితమైన భావాల సమాహారం. ఈ సంకలనంలో కవి... గోరుచిక్కుడు ప్రతీకగా ద్వైతాద్వైతాల్ని పరామర్శిస్తారు, సముద్ర ఘోషలో మార్మిక కవిత్వాన్ని ఆలకిస్తారు, 'నీతో గడిపింది ఒక గంటే, మళ్లీ కలుద్దాం మరుజన్మంటూ ఉంటే' అంటూ ఇంతలోనే పరిచయమై అంతలోనే మాయమైపోయిన మిత్రుడి జ్ఞాపకాల్ని నెమరేసుకుంటారు. సమయపాలనకు ప్రాణమిచ్చే ఓ గురువుగారు మరణించినప్పుడు, 'లేట్ చెయ్యకండి. సార్‌కు కోపమొస్తుంది' అంటూ అందర్నీ హెచ్చరిస్తారు.

సభావేదికల మీద కనిపించే వాడిపోయిన పూలదండల పట్ల సానుభూతిని ప్రకటిస్తారు. 'ఒక్కసారి నవ్వు, రోజంతా కాంతిమంతం అవుతుంది' అంటూ దరహాసం విలువను గుర్తు చేస్తారు.

రెప్పలు దాటని లోకం (కవితా మాలిక)
రచన: డా. ఎన్.గోపి; పేజీలు: 101, వెల:రూ.200
ప్రతులకు: ఫోన్:9391028496

బుక్‌షెల్ఫ్

యేసు ఎవరు?
మూలం: రెజా అస్లాన్
అనువాదం: అరుణ ప్రసాద్
పేజీలు: 221, వెల: రూ.250
ప్రతులకు: ఫోన్: 9381559238

పచ్చడం (సాహిత్య వ్యాసాలు)
రచన: పిల్లా తిరుపతిరావు
పేజీలు: 147, వెల: రూ.200
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు

అంజలిదే... గొనుమా!
రచన: సి.ఎస్.చంద్రశేఖర్
పేజీలు: 96, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 9247302882

రామాయణం-మానవత్వం
రచన: డా.కడిమిళ్ళ వరప్రసాద్
పేజీలు:136, వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9247879606

మౌన రాగాలు
రచన: కె.వి.సుమలత
పేజీలు:163, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 9492656255

అవరోధాలే అవకాశాలు
రచన: కోట దామోదర్
పేజీలు:96, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 9391480475

నేనూ... నా బడి పిల్లలు
రచన: ఇనాయతుల్లా
పేజీలు:136, వెల: రూ.150
ప్రతులకు: ఫోన్: 9849367922

కొసరాజు కవితా వైభవం
రచన: డా. నల్లూరి రామారావు
పేజీలు:231, వెల: రూ.300
ప్రతులకు: ఫోన్: 9866115655

సెరువుకట్ట కాడ సుద్దులు
రచన: అడవాల శేషగిరి రాయుడు
పేజీలు:149, వెల: రూ.200
ప్రతులకు: ఫోన్: 7989546568

చింతలచేను (నవల)
రచన: ఆర్.సి.కృష్ణస్వామి రాజు
పేజీలు:141, వెల: రూ.100
ప్రతులకు: ఫోన్: 9393662821

గుంటూరు సీమ సాహిత్య చరిత్ర
రచన: పెనుగొండ లక్ష్మీనారాయణ
పేజీలు: 516, వెల: రూ.500
ప్రతులకు: ఫోన్: 9291530714

(c) eenadu

రాశి ఫలం

గ్రహబలం

(ఆగస్టు 30 - సెప్టెంబరు 5)

డా॥ శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

మనోబలంతో కొత్త కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఆలోచనల్లో స్థిరత్వం ముఖ్యం. కీలక బాధ్యతల్ని వ్యక్తిగతంగా పర్యవేక్షించండి. వ్యాపార నిర్ణయాల్లో అజాగ్రత్త వద్దు. శుక్రబలం తక్కువగా ఉంది కాబట్టి, ఆర్థిక లావాదేవీల్లో ఆచితూచి వ్యవహరించాలి. కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. హనుమంతుడిని అర్చించండి.

వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అదృష్టవంతులు అవుతారు. బలమైన ప్రయత్నాలు అత్యుత్తమ ఫలితాలను ఇస్తాయి. కొత్త అవకాశాలు తలుపుతడతాయి. వాటిని ఉపయోగించుకోండి. చంద్రబలంతో మానసిక స్థిరత్వం వస్తుంది. శని పట్టుదలను ప్రసాదిస్తాడు. బుధుడి వల్ల ఆలోచనల్లో వేగం పెరుగుతుంది. ఆదాయాన్ని పెంచుకుంటారు. మహాలక్ష్మిని ధ్యానించండి.

మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

శుభాలు జరుగుతాయి. గ్రహబలం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆలోచనలకు నిర్దిష్టమైన రూపం ఇస్తారు. రవి అనుకూలతతో వృత్తి ఉద్యోగాల్లో మెరుగైన ఫలితాలను సాధిస్తారు. శుక్రబలం ఆర్థిక విజయాలను అందిస్తుంది. కొత్త సంపాదన మార్గాలు తెలుస్తాయి. అదృష్టానికి మానవ ప్రయత్నం తోడుకావాలి. లక్ష్మీదేవిని పూజించండి.

కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

లక్ష్యాలను చేరుకుంటారు. విజయం వరించే వరకూ ప్రయత్నాలను ఆపకండి. గ్రహబలం తక్కువగానే ఉన్నా, మనోబలంతో ఆ పరిమితిని అధిగమిస్తారు. బుధుడు ఉన్నతమైన ఆలోచనలను ప్రసాదిస్తాడు. వ్యాపారంలో తెలివైన నిర్ణయాలు తీసుకుంటారు. శుక్రుడి వల్ల ఆర్థిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. నవగ్రహ ధ్యాన శ్లోకాలను పఠించండి.

సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

స్పష్టమైన లక్ష్యాలతో కొత్త పనులను ప్రారంభించండి. ధర్మాన్ని విడిచిపెట్టకండి. శుక్రబలం సంపదల్ని వృద్ధి చేస్తుంది. ఆదాయ మార్గాలను విస్తరించుకుంటారు. ఆలోచనలకే పరిమితం కాకుండా, ఆచరణకూ ప్రాధాన్యం ఇవ్వండి. గత అనుభవాల ఆధారంగా ముఖ్య నిర్ణయాలు తీసుకోండి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పూజించండి.

కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

అనేక విజయాలు సాధిస్తారు. అదృష్టయోగం ఉంది. లక్ష్యంపైనే గురిపెట్టండి. ఆలోచనలు పక్కదారి పట్టకుండా జాగ్రత్తపడండి. అనుభవ సంపన్నుల సలహాలు తీసుకోండి. శుక్రుడు సంపదల్ని వృద్ధి చేస్తాడు. అదనపు ఆదాయాన్ని పొదుపు-మదుపు దిశగా మళ్లించండి. వృత్తి, ఉద్యోగాల్లో సమయస్ఫూర్తి అవసరం. మహాలక్ష్మిని ధ్యానించండి.

తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

గ్రహాల అనుకూలత ఉంది. వృత్తి, ఉద్యోగాల్లో మీదైన ప్రతిభను ప్రదర్శిస్తారు. చిన్నపాటి ప్రయత్నంతో వ్యాపార విజయాలను సాధిస్తారు. బుధుడు ప్రణాళికల తయారీలో సాయపడతాడు. దీర్ఘకాలిక లక్ష్యాల వైపు అడుగులు వేస్తారు. మీ పనితీరును పెద్దలు ప్రశంసిస్తారు. ప్రయత్నానికి రెట్టింపు ఫలితాలు ఉంటాయి. లక్ష్మీనారాయణులను ధ్యానించండి.

వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

గ్రహాల అనుగ్రహం ఉంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆర్థికంగా పురోగతిని సాధిస్తారు. మీ ప్రతిభను నలుగురూ గుర్తిస్తారు. గురువు జ్ఞానాన్నీ, వివేకాన్నీ అనుగ్రహిస్తాడు. శుక్రబలం ఆర్థిక ప్రయోజనాలను ప్రసాదిస్తుంది. బుధబలం తక్కువగా ఉంది కాబట్టి, వ్యాపార సమావేశాల్లో తెలివిగా వ్యవహరించాలి. శ్రీవేంకటేశ్వరుడిని స్మరించండి.

ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

లక్ష్య సాధనలో ఏకాగ్రత అవసరం. అనుకున్న పనులన్నీ వేగంగా పూర్తవుతాయి. గ్రహబలంలోని పరిమితుల్ని ఆత్మశక్తితో అధిగమిస్తారు. ఒకేసారి అనేక పనుల్ని నెత్తిన వేసుకోకండి. వ్యాపారంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే కొత్త అవకాశాలు కళ్లముందు కనిపిస్తాయి. ఉద్యోగంలో సమయపాలన పాటించాలి. నవగ్రహాల్ని ధ్యానించండి.

మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

విజయాలు సూచితం. ఆలోచనల్లో స్థిరత్వం అవసరం. గురుబలం ఉత్తమ నిర్ణయాలను ప్రోత్సహిస్తుంది. ఏదో ఓ రూపంలో అదృష్టం వరిస్తుంది. శుక్రుడు సంపదల్ని ప్రసాదిస్తాడు. రాబడులను పొదుపు-మదుపు దిశగా మళ్లించండి. వ్యాపార వ్యవహారాల్లో నిర్లిప్తత నష్టదాయకం. క్రమశిక్షణ విషయంలో రాజీపడకండి. శ్రీలక్ష్మిని అర్చించండి.

కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

అనుకున్నది సాధిస్తారు. కొన్ని ప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. చిన్నపాటి అవరోధాలకే నిరాశపడకండి. ఆత్మీయుల సహాయసహకారాలు అందుతాయి. అందుబాటులోని ఆర్థిక వనరుల్ని సద్వినియోగం చేసుకోండి. గ్రహబలం తక్కువగా ఉంది. ఆ పరిమితిని ఆత్మవిశ్వాసంతో అధిగమించండి. ప్రయాణాల్లో జాగ్రత్త. నవగ్రహాల్ని ధ్యానించండి.

మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

అదృష్టయోగం ఉంది. కృషికి తగిన ప్రతిఫలం దక్కుతుంది. వృత్తి ఉద్యోగాల్లో మిమ్మల్ని మీరు నిరూపించుకుంటారు. గ్రహాల అనుకూలత అపారం. వ్యాపారంలో ఉత్తమ ఫలితాలను సాధిస్తారు. వ్యయాల నియంత్రణ అవసరం. ఆలోచనల్లో అస్పష్టత మంచిది కాదు. కొత్త బాధ్యతలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి. శ్రీమహావిష్ణువును ధ్యానించండి.

(c) eenadu

పదకేళి

అడ్డం

1. కొరటాల శివ సినిమా, దివిజుడు (3)
3. హలం (3)
5. జననం (3)
7. భర్త (3)
8. లలాటం (3)
9. బూడిద (2)
10. వనిత (3)
12. కొడుకులు (3)
14. పొద; దట్టం (3)
16. హల్లుల్లో మొదటిది (1)
17. అడ్డం 16తో స్వప్నం (1)
18. అడ్డం 16తో అబద్ధం (1)
19. ముక్క, కంద్రిక (3)
21. అధికార హోదా (3)
23. పొట్ట (3)
25. మహిళ (3)
26. చాలా పెద్ద కథ (3)
27. కుడి ఎడమైన క్షీరం (2)
28. పంది (3)
30. సూర్యుడు; ఇంద్రుడు; అమ్మాయి పేరు (3)
32. నెర్రె; చిట్లు, బద్దలగు (3)
34. అడ్డం 16తో ఏనుగు (1)
35. అడ్డం 16తో చెయ్యి (1)
36. అడ్డం 16తో ద్వేషం (1)
37. సేవ, దాస్యం (3)
39. రక్త వర్ణం (3)
41. అమ్మాయి, బాల (3)
43. గంగ (3)
44. అద్దం (3)
45. రథ సారథి (2)
46. తగవు, పోట్లాట (3)
48. కవిత్వం (3)
50. గుమ్మానికి కట్టే తోరం (3)
52. అడ్డం 16తో వానరం (1)
53. అడ్డం 16తో మండూకం (1)
54. అడ్డం 16తో తాటి నీరా (1)



నిలువు

1. వేలుపు (3)
2. స్త్రీ (3)
3. బురద (3)
4. నయనాలు (3)
5. క్రిమి, కీటకం (3)
6. వార్త, ఊసు, సమాచారం (3)
11. కృష్ణుడి పట్టమహిషి (3)
13. భ్రమరం (3)
15. సిద్ధార్థుడు, గౌతముడు (3)
19. ఉత్పలం (3)
20. కయ్యం, జగడం (3)
21. రుచికరమైన తొనలుండే పండు (3)
22. గరుత్మంతుడి తల్లి (3)
23. కొయ్య, చెక్క (3)
24. శార్దూలం... బహువచనంలో (3)
29. ఆదాయం (3)
31. వైరాగ్యం (3)
33. పిడికిలి (3)
37. డోల (3)
38. మత్తు కలిగించే ఒక మొక్క (3)
39. జాకెట్లు (3)
40. ఉమ్మెత్త (3)
41. శరంతో (3)
42. పాత రోజుల్లో- గ్రామ రెవెన్యూ రికార్డులూ లెక్కలూ సరిచూసే వ్యక్తి (3)
47. బోడి మిద్దె (2)
49. వేగం (2)
51. కిరణం, వెలుగు (2)

సుడొకు

4	2		8	1				
	3		5					1
5		1						8
3		5	1			4		2
		2		4		5		
7		8			2	6		3
6						2		4
1					3		7	
				9	5		3	6

గతవారం సమాధానాలు

పదకేళి

1 కే	2 స	రి	✿	3 కౌ	4 స	ల్యా	✿	5 మొ	6 స	లి
✿	తి	✿	7 చె	✿	ర్యం	✿	8 గు	✿	త్రా	✿
9 ఆ	✿	10 ఏ	లి	క	✿	11 త	రు	వు	✿	12 పు
13 కా	ళి	✿	మి	✿	14 ని	✿	వు	✿	15 మి	న్న
శం	✿	16 అ	✿	17 ద్వా	ర	క	✿	18 అ	✿	మి
✿	19 ఆ	ప	20 ద	✿	క్ష	✿	21 కా	ను	22 క	✿
✿	23 మ	రా	ళం	✿	ర	✿	24 క	మ	లం	✿
25 పా	✿	ధి	✿	26 కుం	కు	మ	✿	తి	✿	27 ము
28 తా	ళి	✿	29 గ	✿	క్షి	✿	30 ఆ	✿	31 అ	న్న
ళం	✿	32 హా	ర	తి	✿	33 తు	షా	రం	✿	న
✿	34 గో	✿	ళం	✿	35 పో	✿	ఢం	✿	36 నీ	✿
37 వా	రు	ణి	✿	38 క	రు	ణ	✿	39 ప	రు	వు

సుడొకు

1	2	9	4	8	7	5	6	3
6	4	7	1	3	5	2	9	8
3	5	8	2	9	6	1	7	4
5	9	4	3	2	1	6	8	7
2	7	6	8	5	9	4	3	1
8	3	1	7	6	4	9	2	5
4	6	3	5	7	2	8	1	9
9	8	5	6	1	3	7	4	2
7	1	2	9	4	8	3	5	6

A B C D E F 1 2 3

(c) eenadu

డ్రాగన్ పండులో...
బుజ్జికుక్క బుల్లిపిట్ట!

మెత్తటి గుజ్జుతో నోరూరించే డ్రాగన్ ఫ్రూట్ ముక్కల్ని చెంచాతో కాస్త గట్టిగా నొక్కితేనే ముద్దముద్దలా మారిపోతాయే... అలాంటిది, ఆ సున్నితమైన పండుతోనే కార్వింగ్ చేస్తూ బొమ్మల ఆకారాల్ని తీర్చిదిద్దితే... ఆ ఆర్ట్‌కు ఫిదా అవుతూనే చూసినవారంతా లొట్టలేయరూ. మొన్నమొన్నటి వరకూ ఆర్టిస్టులు పుచ్చకాయ, అరటి, యాపిల్ లాంటి కాస్త గట్టి పండ్లని చెక్కడమే చిత్రం అనుకుంటే- ఇప్పుడేమో ఇలా డ్రాగన్ ఫ్రూట్‌లో అనుకున్న రూపాన్ని తేవడం మరింత విచిత్రమే అని చెప్పాలి. గులాబీ, తెలుపు వంటి రంగురంగుల డ్రాగన్‌ఫ్రూట్స్‌ని నిదానంగా చెక్కుతూ, నచ్చిన ఆకారంలో అమర్చుతూ... గులాబీలూ, నెమలిపింఛం మొదలు పిట్ట, చేప, కుందేలు, బుజ్జికుక్క, పిల్లికూనల వరకూ అన్నింటినీ ఆ పండులో చూపించేస్తున్నారు. ఈసారి మీరూ డ్రాగన్‌ఫ్రూట్‌ని ఎప్పటిలా చిన్న చిన్న ముక్కలు చేసి ఇవ్వడం కన్నా పిల్లలకిష్టమైన బొమ్మలా చెక్కి ఇచ్చారంటే- ఆనందంతో గంతులేస్తూ మరీ తినరూ!

(c) eenadu

ఆ ఊరి పొడవునా పసుపు పూల సోయగాలు తెచ్చే అందం ఒకెత్తయితే... దాన్ని ఆనుకుని, కనుచూపుమేర పరిచిన నీలి రంగు సౌరఫలకాల సౌందర్యం మరొకెత్తన్నట్టు లేదూ ఈ చిత్రాన్ని చూస్తుంటే! చైనాలోని డాంగ్టూ కౌంటీ దగ్గర్లో నదీ ప్రవాహంలోనే ఇలా ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్‌ని ఏర్పాటు చేశారు. ఈ వినూత్నమైన ఆలోచన ఒకవైపు ఊరికి అవసరమైన విద్యుత్తుని అందిస్తూనే, మరోవైపు సరికొత్త గుర్తింపునూ తెచ్చిపెట్టిందన్నమాట!

(c) eenadu